# దైవిక స్వస్థత

**ఆయన తన వాక్కును పంపి వారిని బాగుచేసెను (దా.కీర్త. 107:20).**

(యం. దేవదాసు అయ్యగారి ఉపదేశములు 1937వ సంవత్సరము)

(మందులు లేకుండా దైవ విశ్వాసమువల్ల జబ్బులు బాగుచేసికొను పద్ధతులు)

ప్రియులారా! సర్వ జనులను సృజించిన తండ్రియగు దేవునిబట్టి ప్రియులైయున్న వారలారా! అనాది దైవనామమున మీకు శుభము కలుగును గాక! మరనాత. వ్యాధిగ్రస్థులైన వారికి చేయు విన్నపము:

ఈ పుస్తకములోని సంగతులు బాగుగ చదువుకొని, ఆలోచించి, దేవుని ప్రార్థించి, వ్యాధినిబట్టి కలుగు భీతినుండి విముక్తులై, మన సృష్టికర్తను స్తుతించుడి. ఆపత్కాలమందు తల్లిదండ్రులు జ్ఞప్తికి వచ్చుట సహజము. మన తల్లిదండ్రులకును మనకును, సర్వజనులకును, సర్వసృష్టికిని తండ్రి దేవుడే గనుక ఆయన అందరికంటె గొప్పవాడు. ప్రతి విషయములోను, వ్యాధిస్థితిలోను మొట్టమొదట ఆయనను తలంచుకొనుటయు, ఆయన సహాయము కోరుటయు, యుక్తమైయున్నది. కాబట్టి ఆయనను గురించి వివరించు కొన్ని ఉపదేశములను ఇందులో మిగుల క్లుప్తముగా పొందుపరచుచున్నాము.

## 1. ఆదిలేని కాలము (అనాది)

లోకములు కలుగకముందును, కాలము అనునది లేకముందును, మనమెరిగినది ఏదియు లేకముందును దేవుడొక్కడేయుండెను. మనకు కావలసిన సమస్తమును, తనలోని సద్గుణముల అనుభవమును మనకు

ధారపోయుటకై, తుదకు మనలను కలుగజేయవలెనని ఆయన ఆదియందే (దేవుడు) తలంచుకొను చుండెను. పాపివైనను నీ మేలు గురించి దేవుడానాడే ఆలోచించుకొనెను. ఎంత ప్రేమ! ఎఫెసీ. 1:6.

# 2. దైవ లక్షణములు

1) దేవుడు ప్రేమగలవాడు. మనము పాపమువలన చెడిపోయినను, మనమీద ఆయనకు ప్రేమ. పాపములు పరిహరించుటకై ఆయన మనలను ప్రేమించు చున్నాడు. మనము అజాగ్రత్త వలన జబ్బుపడియున్నను, ఆయనకు మనమీద ప్రేమ గనుక బాగుచేయుటకై, ఆయన మనలను ప్రేమించుచున్నాడు. మనము తెలివి తక్కువవలన ఎన్నో కష్టములలో చిక్కుకొనియున్నను మనమీద ఆయనకు ప్రేమ గనుక ఆ చిక్కులను విడదీయుటకై ఆయన మనలను ప్రేమించుచున్నాడు. వైద్యునికి ఆయన ప్రేమను దయచేయని యెడల రోగి జబ్బు పోవునా? పోదు. ఇంకా ఎక్కువగును గదా? అప్పుడు వైద్యునికి ప్రేమలేదని చెప్పవచ్చునా? అట్లే దేవుడు తన ప్రేమను దయచేయని యెడల మన కీడు తొలగునా? ఎక్కువగునుగదా? అప్పుడు దేవునికి ప్రేమలేదని చెప్పవచ్చునా? దేవుడు ప్రేమయైయున్నాడు. ప్రేమగల దేవుడు నిన్ను ప్రేమగలవానిగా మార్చగలడు.

2) దేవుడు పరిశుద్ధుడు గనుక ఆయనవలన పాపము రాలేదు. ఏ చెడుగును రాలేదు. అన్నిటిని ఆయన కలుగజేసెను గాని పాపమును కలుగజేయలేదు. పరిశుద్ధుడు ఎట్లు పాపమును కలుగజేసెనని మీరనుకొందురు? పరిశుద్ధ దేవుడు మిమ్మును పరిశుద్ధులనుగా జేయగలడు. 3) దేవుడు శక్తిమంతుడు, ఇంత

పెద్దలోకమును అంతపెద్ద ఆకాశమును చేసినవాడు గనుక ఎంత గొప్పశక్తి మంతుడో ఆలోచించుకొనుడి. మనకు ఏదిబడితే అది చేసిపెట్టగలడు. శక్తిగల దేవుడు మిమ్ములను శక్తిమంతులనుగ చేయగలడు. 4) ఆయన జ్ఞాని గనుక ఆయనకు మన కష్టములు అక్కరలు ముందే తెలియును. గనుక మన విన్నపములు గ్రహింప గలడు. 5) దేవుడు న్యాయవంతుడు గనుక ఎవరికి ఏ మంచిస్థితి అనుగ్రహింపవలెనో వారికి ఆ మంచిస్థితి అనుగ్రహించును. 6) దేవుడు సర్వవ్యాపి అనగా అన్ని స్థలములలో నుండువాడు గనుక మనము కొండలలోనున్నను, సముద్రములోనున్నను, శత్రువుల దగ్గరనున్నను, ఎవరు లేనిచోట ఉన్నను భయపడనక్కరలేదు. 7) ఆయనలోని ఈ మంచితనములకు ఆదిలేదు అంతములేదు. ఇట్టి దేవుని నమ్ముకొని యుండుట ఎంత ధన్యత!

## 3. దూతల సృష్టి

**దేవదూతలు పరిశుద్ధులు, ఆత్మ స్వరూపులు:** వారికి మనకున్నట్లు శరీరములేదు. గనుక మన కంటికి కనబడరు. ఒక నిమిషములో ఎన్నివేల మైళ్ళ దూరమైనను ప్రయాణము చేయగలరు. మహా బలిష్టులు, ఎంత గొప్ప పనియైనను నెరవేర్చగలరు. వారికి మనమీద ఎంతో అభిమానము. దైవాజ్ఞనుబట్టి మనకు అన్నిటిలో సహాయము చేయగలరు. వారు మన మిత్రులు. ఇది నమ్మువారు ఎంత క్షేమప్రాప్తులు!

# 4. సాతాను (లూసీఫర్)

పరిశుద్ధ దూతలలో ఒక ప్రధానదూత దేవునిమీద ఎదురు తిరిగి, తనతో అనేకమంది దూతలను జట్టు చేసికొనెను. నేను దేవునికంటే ఎందుకు గొప్పగా ఉండకూడదు! అని అనుకొని చాల గర్వించెను. అందుచేత తానును, తనవారును దేవుని వెలుగులో ఉండ వీలులేకపోయెను. వారందరు కలిసి యొక చీకటి రాజ్యముగా ఏర్పడిరి. దేవుడు చేయు ప్రతి పనిని చెడగొట్ట జూచుటే వారి పని. ముఖ్యముగా మనుష్యులను చెడగొట్టుటయే వారి ముఖ్యోద్దేశము. ***వారు మానవులకు దేవునియందు అభిమానము లేకుండా చేయుచున్నారు.*** దేవుడు ప్రేమయై యుండగా, దేవునిలో ప్రేమలేదను తలంపు నరుల హృదయములో వారు కలిగించుచుందురు. మనుష్యులు చేయు చెడు పనులన్నియు, వారి ప్రేరేపణవల్ల జరుగుచున్న పనులే. (కావున ఆ దూతకు 'సాతాను' అను పేరు వచ్చినది. అతని జట్టు వారికి పిశాచములని పేరు వచ్చినది).

# 5. లోకముల సృష్టి

మనకొక గొప్ప ఇల్లు ఉన్నది- అది ఈ భూమి: దానికొక కప్పుకలదు- అది ఆకాశము. మన ఇంటికి దీపాలు ఉన్నవి- అవి సూర్య చంద్ర నక్షత్రములు. భూమిమీద ఒక మంచి మెత్తని తివాచి పరచబడినది- అది గడ్డి: మనకు దాహశాంతిని, శుద్ధిని కలిగించు సాధనములు కూడ అందులో ఉన్నవి- వాన, నదులు. ఈ భూమి అందించు మధురాహారము- వృక్ష ఫలములు మనమాడుకొను ఆట వస్తువులుకూడ ఇందులో ఉన్నవి- అవి

జంతువులు, పక్షులు, చేపలు. మనకు ప్రాణాధారము – గాలి. మనకు మందునకు ఔషదములు కావలెనని ఆయన మూలికలను, ధనము కావలెనని బంగారము, వెండి, మొదలగు లోహములను అమర్చి పెట్టియుంచెను. అన్నియు సిద్ధముచేసి అప్పుడు నరులను చేసెను. (సృష్టిలో నరుడు ఎంత కడవరి వాడైనను, దేవుని దృష్టిలో మాత్రము అతడు మొదటివాడైనట్టు కనబడుచున్నది) దేవుడెంత జ్ఞాని! నమ్మితే నరుడెంత ఐశ్వర్యవంతుడు! ఎంత ధనికుడు! ఎంత ధన్యుడు!

## 6. నరుల సృష్టి

దేవుడు నరుని సృజించినప్పుడు తనలోని గుణములనుపెట్టి సృజించెను. అందుచేతనే మనుష్యునిలోగూడ ప్రేమ, శక్తి, జ్ఞానము, మంచి తనము, న్యాయము మొదలైన సుగుణములున్నవి. కాబట్టి మానవుడు కేవలము దేవుని పోలికే అని చెప్పుకొను చున్నాము. ఆదిలో దేవుడును, నరుడును కలిసి మెలిసి యుండువారు. దేవుడు అతనికి కనబడి మాటలాడెను. నరుడును దేవునితో చనువుగ మాటలాడెను. దేవుని సహవాస భాగ్యమతనికి కలిగియుండెను. ఆకాశముకంటెను, భూమికంటెను, వాటిలోనున్న వాటికంటెను మనుష్యుడే గొప్పవాడు. మనుష్యుడే సమస్తమునకు అధికారి గనుక అతడు సృష్టికి మ్రొక్కుటకు వీలులేదు. అతడు వాటిని కలుగజేసిన దేవునికి మ్రొక్కవలెను. నరునిది ఎంత గొప్పస్థితి! ఎంత గొప్ప అంతస్థు!

# 7. నరులు పాపములో పడినకాలము

దేవుడు మొదట కలుగజేసిన నరులు ఇద్దరు. పురుషుని పేరు ఆదాము. స్త్రీ పేరు హవ్వ. అప్పుడు సర్వసృష్టి మహా శృంగారముగా నుండెను. వీరును మహా శృంగారవంతులై యుండిరి. వీరిలోఉన్న శుభలక్షణములు ఉపయోగపరచు కొనుటకై దేవుడు వారికొక ఆజ్ఞనిచ్చి చూచెను. గాని వారు దైవాజ్ఞకు భిన్నముగా సాతాను పలికిన వాక్కును వినినందున పాపములో పడిపోయిరి. అప్పటినుండి వారి సద్గుణములన్నింటికి లోపము కలుగ నారంభించెను. అదివరకు వారితో జతగానున్న జీవరాసులు, వారిమీద తిరగబడినవి. సృష్టియావత్తును వారికి వ్యతిరేకమాయెను. భూమిమీద ముండ్లతుప్పలు మొలిసినవి. వారు దేవునినుండి వేరైపోవలసి వచ్చెను గాని దేవుడు వారిని విడిచి పెట్టక, లోక రక్షకుని పంపెదనని వాగ్ధాన మొకటి సెలవిచ్చెను. అది వారికి గొప్ప ఆదరణ కలిగించెను. వారిపాపము, వారి సంతానములో కూడ చొరబడెను. కాలక్రమమున జనసంఖ్య వృద్ధిపొందు చుండగా, పాపమును వృద్ధిపొందెను. ఇది ఎంత దుఃఖకరమైన సంగతి! దేవుని మాట వినిన యెడల ఇంతమట్టుకు రాకపోవునుగదా!

# 8. నిరీక్షణ కాలము

రక్షకుని రాకడకు పూర్వమందున్న భక్తులు, ఆయన రాకడ వాగ్ధానమును నమ్ముచు ఎదురుచూచిన కారణము చేతనే మోక్ష వాసులైరి. భూమి మీద జరుగనైయున్న రక్షకుని చరిత్రాంశములన్నియు, క్రమేణ వారికి ముందుగనే తెలిసినవి.

# 9. పాపముల జాబితా

1) దేవుడుండగా ఆయన కలుగజేసిన సూర్యునికి, చంద్రునికి, భూమికి అందులోని మన్ను, కర్ర, రాయి, వెండి, బంగారము మొదలగు వాటితో చేసిన బొమ్మలకు, వృక్షములకు, జీవరాసులకు, మనుష్యులకు, దయ్యములకు మ్రొక్కుట- ఇవన్నియు పాపములే. వీటికి, ఏ వంకమీద మ్రొక్కినను పాపమే. 2) దేవుని పేరు ఎత్తి అసత్య ప్రమాణము చేయుట. దేవుడే పాపమునకు, పాపఫలమునకు మూలకర్త అనుకొని ఆయనమీద విసుగుకొని దూషించుట పాపమే. 3) దైవారాధనను, దైవబోధను నిర్లక్ష్యము చేయుట, ఆయన ఉపకారములను తలంచి ఆయనకు వందనములు ఆచరింపక పోవుట ఇవన్నియు పాపములే. 4) తల్లిదండ్రుల మాట, పెద్దల మాట, అధికారుల మాట వినకపోవుట ఇవన్నియు పాపములే. (వారిమాట దేవునిమాటకు వేరుగా తోచిన యెడల, దేవుని మాట మాత్రమే వినవలెను). 5) ఒకరిని కష్టపెట్టుట, ధర్మము చేయకపోవుట, కష్టస్థితిలోనున్న వారికి సహాయము చేయకపోవుట, కొట్టుట, చంపుట ఇవన్నియు పాపములే. జీవరాసులను బాగుగా చూడకుండుట, హింసించుట ఇవి పాపములే. 6) వ్యభిచరించుట, భార్యభర్తలలో ఐకమత్యతలేకుండుట, వేరైపోవుట ఇవన్నియు పాపములే. 7) దొంగిలించుట, అన్యాయ వర్తకము చేయుట, తప్పు లెక్కలు చూపించుట ఇవియు పాపములే. దేవుడు మనకిచ్చిన సొమ్మును సామానులను సరిగా వాడకపోవుట పాపమే. దేవుని పనికి ధారాళముగ చందాలియ్యక పోవుట పాపమే. 8) ఒకరిమీద చెడ్డ సంగతులు కల్పించుట, మంచి పేరు చెడగొట్టుట, చాడీలు చెప్పుట, న్యాయసభలలో

అబద్ధ సాక్ష్యమిచ్చుట, రహస్యముగా ఉంచవలసిన సంగతులు వెల్లడిచేయుట ఇవన్నియు పాపములే. 9) ఇతరులకు కలిగియున్నది ఆశించుట, అది తన వశము చేసికొన ప్రయత్నించుట ఇవికూడ పాపములే. 10) చెడుగు తలంచినను, మాటలాడినను, చేసినను, చేయజూచినను పాపమే. చెడుగు చేయుట మాత్రమే పాపము కాదు, మంచి చేయకుండుటకూడ పాపమే. అన్నింటిలోకెల్ల ఏది గొప్ప పాపమో? దేవుని నమ్మకపోవుటే గొప్ప పాపము అని నేననుకొనుచున్నాను. దేవుని నమ్ముటవలన అన్ని భాగ్యములు సంపాదించగలము. నమ్మకపోవుట వలన అన్ని భాగ్యములు పోగొట్టుకొందుము. నమ్మని వారికి నరకము, నమ్మినవారికి మోక్షము. ఆమేన్.

నరకము తప్పించి మోక్షము అనుగ్రహించుటకై, దేవుడు పనిగట్టుకొని ఈ భూమిమీదకు వచ్చి, మన శరీరము ధరించుకొని, యేసుక్రీస్తు అను నామమున వెలసిన సంగతిని నమ్మనియెడల, మంచి సంగతులెన్ని నమ్మినను ప్రయోజనమేమి? ఆ ఇతర వృత్తాంతములు కావు మనలను రక్షించునవి. ఈ యొక్క వృత్తాంతమే మనలను రక్షించునది. దేవుడే మీకు నచ్చచెప్పును గాక!

## 10. అవిశ్వాసి ప్రశ్నలు

నా పాపమువలన వచ్చిన ఈ వ్యాధి, క్రీస్తును నమ్మినంత మాత్రమున పోవునా? ఎన్నో మందులు వేసికొన్నాను, ఎంతోమంది వైద్యులు పరీక్షించిరి, ఎంతోమంది దేవతలకు మ్రొక్కుకొన్నాను, అయినను పోలేదు. గనుక క్రీస్తును నమ్మినంత మాత్రమున పోవునా? ఇది ఎక్కడిమాట? క్రీస్తును నమ్మినవారిని నేను ఎరుగుదును, వారు మాత్రము

బాగైనారా! ఇటువంటి కూటములకు వచ్చిన అందరును బాగగుచున్నారా! పూర్వ జన్మ పాపఫలము తప్పునా? దానిని తప్పించుట దేవునికైనను అలవికాదు. అంతమంది దేవతలను ప్రార్థించినప్పుడు, క్రీస్తును కూడ ప్రార్థించినాను. నా జబ్బు నయమైనదా ఏమి? దేవునికి కనికరమున్న యెడల జబ్బు రాకుండా జేయకూడదా! మానవ జన్మమే పాపము. గనుక పాపము చేయకుండ ఉండగలమా? చేస్తే మాత్రము దేవుడు తెగుళ్ళు పంపవలెనా ఏమి? ఇదేనా ప్రేమ? ఇన్నాళ్ళనుండి ప్రార్థన చేయుచున్నాను. ఇంకను ఏమి జేయగలను? ఇకను ప్రార్థన చేయను, ఏమి చేయను. దేవునికి ఇష్టమున్నయెడల బాగుచేయును. లేనియెడల నా పనిఇంతే. ఇట్టి తలంపులు రోగి మనస్సులో పుట్టుచుండును. వాటిని రానీయకూడదు. ఇది జబ్బుకంటె జబ్బు. వీటన్నిటికి విరుగుడు, యేసుక్రీస్తు తలంపే.

## 11. పాప ఫలితములు

సాతానువలన పాపము ప్రవేశించినది. ఆ పాపము నరులలోనికి జేరినది. దానివలన అవిశ్వాసము, భయము, చింత, అజ్ఞానము. అజాగ్రత్త, అనిశ్చయము, లోపము ఇవి కలుగుచున్నవి. పాపమువలననే వ్యాధులు వచ్చినవి, ఆ వ్యాదుల వలన బాధలేచినది, తుదకు మరణము కలిగినది. విరోధుల వలనను, కరవు వలనను, వరదల వలనను, భూకంపము వలనను, గాడ్పుల వలనను, మంచు వలనను, గాలివానల వలనను, పిడుగుల వలనను, వడగండ్ల వలనను, అడవి మృగముల వలనను, పురుగుల వలనను, ముండ్ల వలనను, చెడు తిండివలనను, కానిమందు వలనను, క్రమములేని వాడుకల వలనను, మరణము

కలుగుచున్నది. దాని తర్వాత నిత్య నరకము. ఆ నరకములో అంతములేని బాధ, వేదన. అనగా నేను దేవునిలోనుండి వేరైపోతినిగదా! అను వేదన. నేను దేవుని నమ్మలేదుగదా అను మరొక వేదన. చదువరులారా! ఈ అంశములోని చెడుగును, హానిని దేవుడు కల్పింపలేదు. ఇది బాగుగ జ్ఞాపకముంచుకొనండి. (విలాప 3:33).

## 12. అవతార కథ

పాపమువలన నరుడు, దేవునిలోనుండి విడిపోయెను. అప్పటినుండి దేవుని చూడవలెనను ఆశ నరునిలో నుండెను. అందుచేత దేవుడే నరుడుగా వచ్చునని, నాలుగువేల సం॥ల వరకు దేవుడు తన భక్తుల మూలముగా లోకమునకు తెలియపరచుచు, ఈ రీతిగా ప్రజల హృదయములందున్న ఆశను వృద్ధిచేసెను. ఈ ఆశ తీర్చుటకు దేవుడు నరుడాయెను. దేవుడు దేవుడుగావచ్చిన యెడల, నరుడు ఆయనను చూడలేడు గదా! నరరూపములో కనబడినయెడల దేవుని చూడగలడు. అప్పుడు దేవుడు నరునితో కలిసిమెలిసి యుండగలడు, బోధింపగలడు, నరుడు చూచుచుండగనే అన్ని విధములగు సహాయములు చేయగలడు. ఆ అవతార పురుషుడు దైవ ప్రభావమువలన ఒక కన్యక గర్భమున జన్మించెను. ఆ కన్యక పేరు మరియమ్మ. ఆ అవతార పురుషుని పేరు యేసుక్రీస్తు. ఈయన లోకమునకు పాపము తెచ్చిన సాతానును, దయ్యములను, పాపములను, వ్యాధులను, శ్రమలను, మరణమును, నరకమును గెల్చెను. మానవులు తెలిసికొనవలసిన మంచి చెడ్డలను తన బోధలో విశదపరచెను. భూలోకమునకు రక్షకుడుగా వచ్చునని పూర్వకాల

భక్తులు ప్రవచించి చెప్పిన గుర్తులన్నియు, ఈయనలో కనబడినవి. అయితే, దేవుడే పాపము చేయించు చున్నాడనియు, శిక్షించు చున్నాడనియు, నరులెన్ని కష్టములను అనుభవించుచున్నను నాకేమని ఊరుకొనుచున్నాడనియు, ఆయన ఎవ్వరును సమీపింప వీలుగాని భయంకరుడనియు ప్రజలు తలంచుచుండిరి. దేవుడు సర్వజనులకు తండ్రియనియు, లోకమును ప్రేమించువాడనియు, కనికరము గలవాడనియు, క్షమించువాడనియు, ప్రార్థన ఆలకించువాడనియు, కృతజ్ఞతలేని వారియెడలను, దుష్టుల యెడలను ఉపకారియై యున్నాడనియు ఈయన బోధించి చూపించెను. ఇది క్రొత్త బోధ. (మార్కు 1:27) ***దేవుని యెడల మనకుగల దురభిప్రాయములన్నియు కొట్టివేయు క్రొత్తబోధ.*** దేవునికిని మనకునుగల తండ్రి బిడ్డల వరుస, ఈయన బోధలో తేలినది. దేవుడు నా తండ్రియనియు, నేను ఆయన బిడ్డననియు సంతోషముతో గంతులువేయించు బోధ ఇది.

ఎవ్వరును ఈ బోధ చేయలేదు. మరో సంగతి వినండి. తన యొద్దకు వచ్చిన పాపులను క్రీస్తు ప్రభువు క్షమించెను. రోగులను కనికరించి, ఔషధ సహాయములేకనే తన మాటవలననే బాగుచేసెను. దేవుడు భయంకరుడైన యెడల ఇట్లు చేయునా?

ఆయన వ్యాధి గ్రస్తులలోని దయ్యములను, సర్వాధికారముతో వెళ్ళగొట్టెను. మృతులను బ్రతికించెను. దేవుడు భయంకరుడైన యెడల ఇట్టి పనులు చేయునా? క్రీస్తు ప్రభువు తన మాటవలనను, అద్భుత క్రియలవలనను, తాను దేవుడైనట్లు కనబరచెను. చూపులకు, మనుష్యుడే. ఆయన కేవలము మనుష్యుడేగాని నిజమునకు ఆయన దేవుడు. దేవుడెట్లు మనుష్యుడాయెను? ఎందుకాయెను? దేవుడు,

దేవుడుగానే యుండి మనలను రక్షింపరాదా? అని కొందరడుగుచున్నారు. దేవుడు దేవుడుగానే వచ్చినయెడల ఆయన తేజస్సునకు నరలోకమంతయు భస్మమైపోవును. దేవతగా వచ్చినయెడల మనుష్యులు భయపడి పారిపోవుదురు. జంతురూపమున వచ్చిన యెడల కొట్టుదురు, చంపివేయుదురు. మనుష్యునిగా వచ్చిన యెడల దగ్గరకు చేర్చుకొందురు. అందుచేత దేవుడు నరరూపముతో వచ్చెను. దుష్టులు ఆయనను గ్రహింపలేక, ఆయనను పట్టుకొని బంధించి, మేకులతోకొట్టి, కొరతవేసి కొట్టి చంపివేసిరి. **ఇన్ని బాధలు పెట్టుచున్నను, ఆయన వారిమీద కోపపడక ఓర్చుకొనెను.** శిక్షించుటకు ఆయన ఈ లోకమునకు రాలేదు. రక్షించుటకు వచ్చెను. ఆయన వట్టి మనుష్యుడే అయిన యెడల కొంచెమైనను కోపపడి యుండును. సిలువమీద అనగా కొరతమీద ఉండి ఆయన అగుపరచిన ప్రేమ, మనుష్యులు అగుపరుప గలరా! అది ప్రేమ కాదు. కేవలము దేవుడగుపరుపగల ప్రేమ. ఆయన దేవుడని అదివరకు గ్రహించి యుండనివారు, అట్టి ప్రేమను చూచియైనను గ్రహించియుండిన యెడల ఎంత బాగుగ నుండును. అయ్యో! పాపమువలన మానవులెంతగా చెడిపోయిరి. తుదకు జరిగిన కథ వినుడి: ఆయన భూస్థాపనయై మూడవ దినమున ప్రాణముతో బయటకు వచ్చి, విశ్వాసులకు కనబడి, నలువది దినములు వారితో నుండెను. సిలువమీద ఆయనవుండి మన పాపములను, మన వ్యాధులను, మన శిక్షను తనమీద వేసికొన్నందున మనకు మహోపకారము చేసెను. ఇది, కీడు తొలగించిన ఉపకారము.

బ్రతికి వచ్చుట వలన మనకు జయము, అనంతజీవము, నిత్యానందము,దైవ సహవాసము మొదలగు పరమ భాగ్యములు తెచ్చిపెట్టెను. ఇది మరొక ఉపకారము. ఆయన మనుష్యుడు గనుక మరణింప గలిగెను. దేవుడు గనుక మరణమును ఓడగొట్టి, బ్రతికి రాగలిగెను. అందుచేత ఆయన ఒక్కడే మన దేవుడును, రక్షకుడునై యున్నాడు. ఆయన కడకు తన శిష్యులను చేరపిలిచి, మీరు సర్వలోకమునకు వెళ్ళి నా సంగతులు అందరికి బోధించుడి అనియు, నమ్మి స్నానము పొందువారికి  రక్షణయనియు, నమ్మనివారికి శిక్షయనియు చెప్పి, మహిమ శరీరముతోనే పరలోకమునకు వెళ్ళెను. అందుచేతనే ఆయన శిష్యులు సర్వత్ర సంచరించుచు, ఆయన బోధ వినిపించుచున్నారు.

ఇదివరకు చెప్పవలసిన ఇంకొక సంగతి వినుడి: నేను పరలోకమునకు వెళ్ళి మరల వచ్చెదను అని ఆయన వారికి చెప్పియుండెను. ఆ కారణము చేత, ఆయన భక్తులు ఆయన రెండవ రాకడ కొరకు కనిపెట్టుచున్నారు. ఆయనవచ్చి ఇదివరలో చనిపోయియున్న భక్తులను బ్రతికించి, అప్పటివరకు బ్రతికియున్న భక్తులను అనగా మనలను, ఒక క్షణములోనే మహిమ శరీర ధారులనుగామార్చి మరణము లేకుండజేసి పరలోకమునకు కొనిపోవును. ఆయనవచ్చు గడియ తెలియదు గనుక ప్రతి దినము సిద్ధపడి యుండుట క్షేమము. భక్తులు వెళ్ళిపోయిన తరువాత మిగిలిన వారికి లోకమెన్నడును ఎరుగని బాధలు కలుగును. అటుతరువాత ఆయన ఈ భూమిమీద నీతి పరిపాలన చేయును. తుదకు సాతానును, అతని సంబంధికులు అందరును, ఆయన తీర్పు

విధించినవారును, అంత్యదినమున నిత్య నరకాగ్ని గుండములో పడవలసి వచ్చును.

# 13. బైబిలు గ్రంథము

ఇది దైవభక్తులు దైవాత్మ ప్రేరేపణ చేత వ్రాసిన గ్రంథము. దేవుడు మనకు చెప్పవలసిన మాటలన్నియు దీనిలోనున్నవి. దేవుడు సర్వలోకములను ఎంత పరిశుద్ధముగా సృజించెనో, నరులు ఎట్లు పాపములో పడిపోయిరో, ఏది చేసిన పాపమో, ఏది మానిన పాపమో, ఏది చేసిన మంచిదో, ఈ గ్రంథము తెలియజేయును. రక్షకుని పంపించెదను అని దేవుడు వాగ్దానములు చేయుచు, ప్రజలలో ఆశనెట్లు వృద్ధిచేసెనో, చివరకు దేవుడు నరావతారమెత్తి యేసుక్రీస్తు అను నామమున ఎట్లు ప్రత్యక్షమాయెనో, ఆ నామమున క్రైస్తవమతమెట్లు స్థాపన యాయెనో, క్రీస్తు ప్రభువు మరలవచ్చి విశ్వాసులను మాత్రమే మహిమ శరీరముతో మోక్షమునకెట్లు తీసుకొని వెళ్ళునో, సర్వజనులకు క్రీస్తు సువార్త మరల మహా తీవ్రముగా ఎట్లు ప్రకటనయగునో, అవిశ్వాసులకెట్లు తీర్పుకలుగునో, ఇట్టివన్నియు ఈ గ్రంథములోనున్నవి. ఇది అనుదినము చదువుచున్న యెడల దేవుడు మనతో మాటలాడుచున్నట్లుగానే యుండును. ఇకముందుకు ఇవి జరుగును అని చెప్పిన సంగతులు, ఆయాకాలములలో జరిగినవి. ఇప్పుడు మన కాలములోను జరుగుచున్నవి. త్వరలో లోకమందంతటను జరుగవలసిన మార్పులు బైబిలులోని చివర పుస్తకములో వివరముగా నున్నవి. అందుచేత 75 రూపాయలు చెల్లించి, బైబిలు కొనుక్కొని అందరు చదువవలసినదే. ఇది దేవుడు మనకు వ్రాసి పంపిన గొప్ప ఉత్తరము.

బైబిలును ఇప్పటికి 2000 భాషలలోనికి మార్చినారు. ప్రపంచములోని ఏ గ్రంథము, ఇన్ని భాషలలోనికి రాలేదు. క్రైస్తవమతము సర్వలోక మతము, గనుక ఆ మత గ్రంథమగు బైబిలు సర్వభాషలలోను అచ్చుపడవలెను, సర్వ దేశములలోను ప్రకటన కావలెను. దేవుడొక్కడే గనుక దేవుని గురించి బోధించునట్టి గ్రంథమును ఒకటే. ఆ గ్రంథమును అనుసరించు మతమును ఒకటైయుండుట ధర్మమై యున్నది.

# 14. యేసుక్రీస్తు

దేవుడే రూపము కలిగియుండును? ఎట్టి స్వభావము కలిగియుండును? ఏమేమి పనులు చేయును? పాపులమైన మన విషయములో ఎట్లు ప్రవర్తించును? మనలనెట్లు చూచును? సర్వలోకములకును ఆయనకును ఏమైన సంబంధమున్నదా? ఆయన మన కష్టములను తొలగించునా? మనకు సదుపాయములు చేయునా? దేవుడు అను ఆయన ఒకడున్నాడా? ఉన్నయెడల మానవులు ఇన్ని చిక్కులు పడుచుండుట చూచి ఎందుకు ఊరుకొనుచున్నాడు? తుదకు మనలను లోకములను ఏమిచేయదలచుకొన్నాడు? ఈ బ్రతుకైన పిమ్మట వేరొక మేలైన బ్రతుకున్నదా? అపవిత్ర జీవనమును పూర్తిగ విసర్జించుట మనకేనాటికైన వీలుపడునా? ***పవిత్ర జీవనమున స్థిరపడుట మనకేనాటికైన సాధ్యమగునా?*** మనము నిత్యమూ ఆ లోకమున దేవునితో నుండగలమా? ఇట్టి ప్రశ్నలు అనేకములు నరహృదయములో పుట్టుచున్నవి. వీటన్నిటికిని దేవుడు ఉత్తరము చెప్పుటకు, ఆయనే ఒక మారైనను భూలోకమునకు రావలెను.

లోక ప్రతినిధులకైనను కనబడవలెను. తన ముఖబింబమును, మాటలను, కార్యములను, ప్రవర్తననుచూచి, ఈయన వస్త్రధారణకు శరీరియైనను, తత్వమునకు దేవుడని మానవులు స్వయముగా అర్ధము చేసికొనగలుగునట్లు దేవుడందరిలోను వెలగవలెను. భూలోకమునకు మధ్యనున్న పాలెస్తీనా దేశమున దేవుడు ఇట్లు ప్రత్యక్షమాయెను. నరుడుగానున్నందున, ఏదోయొక పేరు పెట్టుకొనని యెడల అందరు ఆయనను ఏమని పిలుతురు? అందుచేత ఆయన యేసుక్రీస్తు అను నామమున ప్రసిద్ధికెక్కెను. నరులను రక్షించునట్టి పనికి ఏర్పడిన రక్షకుడను భావము ఈ నామములోనున్నది. నరులు పెట్టుకొన్న నామమువలన ముక్తి కలుగదు. ***ఇది దేవుడు పెట్టుకొన్న నామము గనుక ఈ నామములోనే దేవుడు బైలుపడినాడు*** గనుకను, ఈ నామ వృత్తాంతమే మన బ్రతుకు తెరువగుకథ నడిపిన పవిత్ర చరిత్ర గనుకను, ఏ శ్రేష్టనర నామ చరిత్రకైనను, ఏ దేవదూత నామ చరిత్రకైనను లేని కళ ఈ యేసుక్రీస్తు నామ చరిత్రకే యున్నది గనుకను, ఈ నామము మూలముగానే దేవుడు ముక్తిని ప్రకటించినాడు గనుకను ఈ నామస్మరణవలననే విముక్తి లభించును. ఆయన పరిహరింపలేని పాపములేదు, బాగుచేయలేని వ్యాధిలేదు, తొలగింపలేని చిక్కులేదు, ఇయ్యలేని దానములేదు. ఆయనను స్తుతింపగా అన్ని విషయములందును శాంతి సమకూడును.

## 15. క్రీస్తు ఘనవైద్యుడు

యేసుక్రీస్తు ప్రభువు దైవారాధన మందిరములో ప్రవేశించి బోధించుచు, దైవ రాజ్య విశేషములు ప్రకటించుచు, ప్రజలలోని

ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచు గలిలయ దేశమందంతట సంచరించెను. ఆయన కీర్తి సిరియా దేశమంతట వ్యాపించెను. నానా విధములైన రోగముల చేతను, వేదనల చేతను, పీడింపబడిన వ్యాధిగ్రస్థుల నందరిని, దయ్యములు పట్టినవారి నందరిని, చాంద్ర రోగులను, పక్షవాయువు గలవారిని వారాయనయొద్దకు తీసికొనిరాగా, ఆయన వారిని స్వస్థపరచెను. గలిలయ, దెకపొలి, యెరూషలేము, యూదయ అను ప్రదేశములనుండియు యొర్దాను నది కవతల నుండియు బహుజన సమూహములు ఆయనను వెంబడించెను. అని బైబిలులో నున్నది. (మత్తయి 4:23-25).

పాపములనుండి నరుల ఆత్మలను రక్షించుటకు మాత్రమేకాక; వారి శరీరములను వ్యాధులనుండి రక్షించుటకు కూడ దేవునియొక్క నరావతారమైన యేసుప్రభువు, తాను భూమిమీద నున్నప్పుడు తనయొద్దకు వచ్చిన ప్రతిరోగిని, తన వాక్యము వలనను, స్పర్శవలనను ఆరోగ్యవంతులనుగా జేసెను. ఆయన బాగుచేసిన వ్యాధులివి:

1. **పిచ్చితనము:** దిగంబరియగు మతిహీనుడు ఒకడు ఆయనకు నమస్కరింపగా, ఆయన అతనిలోని దయ్యములను వెళ్ళగొట్టి నిర్మలమతిని గలిగించెను. వెంటనే అతడు స్వజన బోధకుడాయెను. నమస్కరించుటలో నమ్మికగలదు.

2. **గ్రుడ్డితనము:** నమ్ముచున్నారా! అని ఆయన ఇద్దరు గ్రుడ్డివారిని అడిగెను. వారు నమ్ముచున్నామనగానే, మీ నమ్మిక చొప్పున మీకు కలుగునుగాక! అని వారికి

దృష్టిననుగ్రహించెను. నమ్ముచున్నామనుటలో నమ్మికగలదు.

3. **చెవుడు, నత్తి:** ప్రజలొక చెవిటి నత్తివానిని ఆయనయొద్దకు తీసికొనిరాగా, ఆయన వాటిని విడిపొమ్మని చెప్పెను. అప్పుడు వానిలోని చెవుడు నత్తిపోయెను. ఆయనయొద్దకు వచ్చుటలో వాని నమ్మికగలదు.

4. **ఎండిన చేయి:** ఎండిన చెయ్యిగల ఒకరితో ఆయన చేయి చాపుమనగా, అతను చాపెను. అప్పుడే అది బాగాయెను. చాపుటలో నమ్మికగలదు.

5. **కుంటితనము:** 38 ఏండ్లనుండి పడియున్న వానిని నడువుమనగానే వాడు నడిచెను. వెంటనే వాని జబ్బుపోయినది. నడవ యత్నించుటలో నమ్మికగలదు.

6. **జలోదరము:** జలోదర రోగిని ఆయన చేరదీసి, నీరు పోగొట్టెను. చేరుటలో నమ్మిక గలదు.

7. **జ్వరము:** దూరముననున్న కుమారుని జ్వరము పోయినదని ప్రభువు తెలియజేయగా, తండ్రి అది నమ్మి వెళ్ళిపోయెను. జ్వరము వానిని విడిచినది. స్వస్థత చూడకున్నను వెళ్ళుటలో నమ్మిక గలదు.

8. **కుష్టు:** 'పూజారికి కనబడుడి అని ఆయన చెప్పినంత మాత్రమున' పదిమంది కుష్టురోగులు వెళ్ళుచుండగా, దారిలోనే స్వస్థత నొందిరి. రుగ్మత ఉన్నను వెళ్ళుటలో నమ్మికగలదు.

Bible Mission HQ Guntur

9. **పక్షవాయువు:** నీవు లేచి నీ పరుపెత్తుకొని నడువుమని, లేవలేనియొక పక్షవాత రోగితో ఆయన అనగా అతడట్లు చేసెను. చెప్పినట్లు చేయుటలో నమ్మికగలదు.

10. **రక్త స్రావము:** 12 ఏండ్లనుండి ఈ వ్యాధిగల యొక స్త్రీ ఆయన పైవస్త్రము మాత్రమే ముట్టిన బాగుపడుదునని తనలో తాననుకొని ముట్టుకొనగా ధారకట్టెను. అనుకొనుటలో నమ్మికగలదు.

11. **నిస్సత్తువ:** నీ బలహీనతనుండి విడుదల పొందియున్నావని నీరసించి, నడుము వంగిపోయిన ఒక స్త్రీతో ఆయనచెప్పి, ఆమెమీద చేతులుంచినపుడు, ఆమె చక్కగా నిలువబడెను. విడుదల రాక పూర్వమే వాక్యమును, స్పర్శను అనుకొనుటలో నమ్మికగలదు.

12. **గాయము:** ఒకడొక చెవి నరకగా ఆయనముట్టి బాగుచేసెను. చేయనిచ్చుటలో నమ్మికగలదు. ఇవి బైబిలులో ఎక్కడున్నవి?

చదువరులారా! రెండు సంగతులును గుర్తించండి. 1) ఆశ్రయించిన అందరిని ఆయన స్వస్థపరచెను, 2) అన్ని వ్యాధులను పోగొట్టెను. ఇంతేగాక దయ్యములను వెళ్ళగొట్టెను, మృతులను లేపెను, పాపములు పరిహరించెను. క్రీస్తుప్రభువు బాగుచేయగలడని నమ్మి ఊరకుండుట చాలదు, లేచి తిరుగలాడవలెను, సంతోషముగా నుండవలెను. పాపములనుగాని, జబ్బులనుగాని తలపెట్టనేకూడదు (తలంచకూడదు) ఈ చర్యలులేని నమ్మిక నమ్మికకాదు. నమ్మికలేని యెడల నమ్మిక కలిగించుమని ఆయనను ప్రార్థించుడి.

# 16. స్వస్థత

స్వస్థత విషయము అనగా ఔషదములేకుండనే జబ్బులు పోగొట్టుకొను పద్ధతి: మందులు లేకుండ దేవుడు జబ్బులు పోగొట్టడు అను తలంపు నీలోనుండి తీసివేసికొనుము. దేవునివల్ల సృజింపబడిన మూలికలు, వ్యాధులను పోగొట్టు చుండగా దేవుడు పోగొట్టలేడా? నీలో ఏదైన లోపమున్న యెడల మొదట అది పరిహరించు కొనుము. జబ్బు తీసివేయుమని ఒకసారి పూర్తిగా ప్రార్థించిన చాలును. ఆలాగు ప్రార్థించుము గాని ఒకమారు జబ్బు పోకపోవచ్చును. అయినను పోయినట్టే అని నమ్ముము. అప్పుడు అదిపోవును. ఇది క్రీస్తు బోధలోని సారము (మార్కు 11:24). మొదట మీరు ప్రార్థించిన, తరువాత స్వస్థత కనబడువరకు ఏమి చేయుదురు? స్తుతించుము. అనగా తండ్రీ! ఇది తీసివేసినావు అని చెప్పుచు స్తుతించుము, నమ్ముచు స్తుతించుము. అనారోగ్య కరమైన స్థితిలోనున్నను సంతోషము కలుగువరకు స్తుతించుము. బాగైనది అను సంతోషము కలుగువరకు ఆనందించుము. ఈలాగు చేయుదువా? లేక విసుగుకొని మానుదువా?

# 17. కృతజ్ఞత

కృతజ్ఞత అనగా ఒకరు మనకు చేసినమేలు మరువకుండుట. కృతజ్ఞత చూపుటెట్లు? మన ఉపకారులయొద్దకు వెళ్లి వందనములు చేయుట వలనను, బహుమానము లిచ్చుటవలనను, ఆ ఉపకారి గురించి ఇతరులకు చెప్పుట వలనను, మనస్సులో అభిమానము కలిగియుండుట వలనను కృతజ్ఞత చూపగలము. యేసుక్రీస్తు ప్రభువువలన పాప విముక్తిని,

స్వస్థతను పొందినవారుకూడ అట్లే చేయవలెను. స్వస్థి కూటములో వెంటనే బాగైనవారు, వెంటనే అందరిమధ్యనే తమ స్వస్థతను గురించి చెప్పవలెను. సిగ్గుపడరాదు. మరునాటి కూటములోనైన చెప్పవలెను, పూర్వము క్రీస్తుప్రభువు నొద్దకు పదిమంది కుష్ఠురోగులు వచ్చి, దారిలో బాగైరి గాని ఒక్కడే ఆయనయొద్దకు తిరిగివచ్చి నమస్కరించెను. ఆ రోగి దేవుని మెప్పు పొందెను. తక్కిన తొమ్మండుగురికి ఆ మెప్పు లేదు. వారివలె మీరు చేయకుడి.

## 18. జబ్బు తిరుగబెట్టుట

దైవ స్వస్థికూటములో జబ్బు కుదిరిన తర్వాత ఎప్పటికైన అది మరల వచ్చునా? రాదు, రాదు. క్రీస్తు బాగుచేసెను గనుక రానేరాదు. గాని మరల రోగి పాపముచేసి జబ్బు తెచ్చుకొన్న యెడల రాదా ఏమి? చెట్టెక్కి పడి కాలు విరుగగొట్టుకున్న పిల్లవానిని వైద్యుడు బాగుచేయగా, మరునాడు మరల చెట్టెక్కి పడిన యెడల కూడ కాలు మరల విరగదా ఏమి? విశ్వాసమువలన అది తిరిగిరాదా? విశ్వాసమువలన పేతురు అను శిష్యుడు క్రీస్తుతో నీళ్ళమీద నడిచి నడిచి, సందేహపడగా మునిగిపోవ నారంభించెను. అవిశ్వాసీ ఎందుకు సందేహపడితివి? అని ఆయన అతనిని గద్దించెను. జాగ్రత్త! నీలోనికి అనుమానమును రానీయకుము.

## 19. ప్రార్థన సంగతి

నీకేదైనా కావలసినప్పుడు దేవుని ప్రార్థించుము. అడిగినది దొరకకపోయినను, దొరికినట్లే భావించుకొనుము. నీ ప్రార్థన ముగింపులో ఆమేన్ అనవలెను.

# 20. విశ్వాసుల వ్యాధి

కొందరు క్రీస్తును నమ్ముకొన్నను జబ్బుగానే ఉందురు. ఎందుచేత? ఈ జబ్బు స్థితిలో విశ్వాసులు దేవుని స్తుతించుట వలన ఆయనకు కీర్తి కలుగును. అవిశ్వాసులు స్తుతింపలేరు. ఎన్ని కష్టములున్నను, దేవుడు ప్రార్థన నాలకింపక వాటిని తొలగింపకున్నను, భక్తులు దేవుని మెచ్చుకొనుచునే యుందురు. ఇందువలన సాతానుకు పరాభవము కలుగును, దేవునికి ఘనత కలుగును. యోబు అనునొక భక్తుడు కలడు. సాతాను దేవుని యొద్ద సెలవు పొంది అతనిని చాల హింసించెను: యోబు యొక్క బిడ్డలు చనిపోయిరి, చాలమంది సేవకులు హతులైరి, పరజనులు వేలకొలది పశ్వాదులను తోలుకొనిపోయిరి, అతనికి ఒంటినిండ కురుపులు లేచినవి. అయితే ఆయన 'దేవుడిచ్చెను దేవుడు తీసికొనెను, దేవుని నామమునకు స్తుతి కలుగును గాక!' అని పలికెను. 'దేవుని దూషించి మరణము కమ్మని' అతని భార్య దూషించెను. నీవు మూర్ఖురాలు మాటలాడునట్లు మాటలాడుచున్నావు. మనము దేవుని వలన మేలునే అనుభవించుదుమా, కీడును మనము అనుభవింపతగదా! అని యోబు ఉత్తరమిచ్చెను. సఖములోచేయు స్తుతికంటే, దుఃఖములో చేయుస్తుతి ఎంతో మెచ్చుకొన తగినది, **స్తుతి చేయు భక్తుల కష్టముల మూలమున దైవరాజ్యమందు ఎన్ని నీతి పాఠములో!** ఎన్నో మహోపకారములు. ఈలాగు ఎన్ని దైవ కార్యములు బయలు వెడలునో ఎవరు చెప్పగలరు? మనము జీవించినను దేవునివారమే, చనిపోయినను దేవుని వారమే దేవుని వారమైయుండు భాగ్యము మాత్రము మనకు తప్పదు. విశ్వాసులకు గతింపని కష్టమున్న యెడల, క్రైస్తవులు దానిని 'శరీరములోని ముల్లు' అని అందురు.

పూర్వము పౌలు అను పేరుగల ఒక మత ప్రచారకుడుండెను. తన కష్టమును తొలగించుమని దేవుని ప్రార్థింపగా, 'నా కృప నీకు చాలును' అని దేవుడు ఉత్తరమిచ్చెనే గాని దానిని తొలగింపలేదు.

# 21. ప్రార్థన సంగతి

నీకు ఏదైన కావలసినప్పుడు దేవుని ప్రార్థించుము. అడిగినది దొరుకకపోయినను దొరికినట్లే భావించుకొనుము. ఎందుకనగా ప్రార్థనలు ఆలకింతునని దేవుడు వాగ్దానమిచ్చియున్నాడు. దేవుడు నమ్మతగినవాడు. ఆ ప్రార్థన విధమేమనగా:

1. మొదట నీ గదిలో మోకాళ్ళూని నీ యెదుట దేవుడున్నాడని నమ్ముము. 2. తర్వాత నీ పాపములన్నియు ఒప్పుకొనుము. 3. అటు తరువాత ఇకమీదట పాపము చేయకుండ నడచుకొనుటకు నాశక్తి కొలదినాకు తెలిసినంత మట్టుకు ప్రయత్నింతును అని ప్రమాణము చేయుము. 4. పిమ్మట నీ ప్రార్థనలు దేవుడు విన్నాడని పూర్తిగా నమ్మి ఆయనను స్తుతించుము. దేవుడు నీ కొరకు నరజన్మమెత్తిన గడ్డైన పనికంటే, నీ మనవి ఆలకించు పని అంత గడ్డైనదా ఏమి?

# 22. ఒక మందలింపు

"నేను నీకు శిక్షవిధింపను. నీవు వెళ్ళి ఇకను పాపము చేయకుము" అని క్రీస్తుప్రభువు నొకప్పుడొక స్త్రీకి చెప్పినమాటయొక్క భావము తెలిసికొనుడి. మరియు ఆయన స్వస్థత నొందిన ఒకనిని చూచి, 'ఇదిగో నీవు స్వస్థత నొందితివి మరి ఎక్కువ కీడు నీకు

కలుగకుండునట్లు ఇకను పాపము చేయకుము' అని మెళకువ చెప్పెను. ఈ మాటల అర్థముగూడ గ్రహించుకొనండి.

# 23. అనుకరణము

అనుకరణము అనగా ఒకరు చేసినట్లు చేయ యత్నించుట. ఒకరు బోధించి ప్రార్థింపగా, రోగులు బాగగుచున్నారని అట్లే చేయ జూచినయెడల స్వస్థత కలుగదు, రాదు. అందువలన దేవునికి అపకీర్తి కలుగును. రోగులు బాగగు వరము కావలసినవారు ఏమిచేయవలెనో వినుడి. మొదట పాపములు ఒప్పుకొనవలెను. ఆ తర్వాత ఇకమీదట పాపమును అనగా దుష్కార్యములను విసర్జింతునని తీర్మానించుకొనవలెను. పిమ్మట దైవచిత్తానుసారముగా సత్కార్యములు చేయుచు బ్రతుకుదును అని నిర్ణయించు కొనవలెను. అటు పిమ్మట దేవునికి సంపూర్తిగా సమర్పించుకొనవలెను. దేవుని వాక్య గ్రంథమగు బైబిలు బాగుగ నేర్చుకొనవలెను. ఇందువలన విశ్వాసము కలుగును. ఇది రోగులను బాగుచేయు విద్య బైబిలులోనున్నది. ఇది బాగుగ నేర్చుకొనవలెను. ఇది గొప్ప వరము. దేవుని ప్రార్థించుకొని, ఆయన సమ్మతిని పొంది, సువార్త ప్రకటించు పనిమీద ఉండి, రోగుల నిమిత్తమై బోధయును, ప్రార్థనయును చేయవలెను. దేవుడు తప్పకుండ రోగులను బాగుచేయునని నమ్మవలెను. ఇతరులను నమ్మింపవలెను. అప్పుడు రోగులు బాగుపడుదురు. ఇట్లు చేయక, అట్లు చేసిన యెడల దేవుని వాక్యమును, ఆయన సేవకులను వెక్కిరించినట్లుండును. గనుక గొప్ప హాని కలుగును. ఇది బాగుగా గ్రహించుకొనవలెను.

# 24. క్రీస్తు శిష్యులు

మెస్సీయా అన్నను, క్రీస్తు అన్నను, యేసు అన్నను, యేసుక్రీస్తు అన్నను, క్రీస్తుయేసు అన్నను, ఆ ఏక దైవావతార పురుషునకే చెందును. క్రీస్తుప్రభువు ననుసరించిన మొదటి శిష్యులు కొందరు, ఆయన పరలోకమునకు వెళ్ళిన పిమ్మట ఆయన ఆజ్ఞానుసారముగా యెరూషలేము పట్టణమున దైవ ప్రార్థన దీక్షమీద నుండగా, దైవాత్మ వారి హృదయములను ఆవరించినందున, భాషలవరము పొంది, ప్రార్థన గదిలో నుండి బైటికి వచ్చిరి. దైవాత్మా వేశము వలన బోధనాశక్తి గలవారై, సర్వ ప్రాంతములనుండి తమ పండుగ పనిమీద అక్కడకు వచ్చియున్న వారికి, వారివారి భాషలలో క్రీస్తుబోధ వినిపింపగా, మూడు వేలమంది ఆ బోధ నంగీకరించి క్రీస్తు మతస్నానము పొందిరి. క్రీస్తును తాము స్వయముగా చూచినట్లు శిష్యులు సాక్ష్యమిచ్చినందున, బోధపని విశ్వాస పాత్రమైన పనిగా వర్ధిల్లినది. తరువాత శిష్యులు దేశదేశములకు వెళ్ళి ఈ రక్షణబోధను వ్యాపింపచేసిరి. ఈ దైవమతకార్యము నేటి వరకును జరుగుచున్నది.

# 25. క్రీస్తు సిలువ

నిలువుకర్రకు అడ్డముగా దిగగొట్టిన కర్రగల యొక స్తంభమునకు సిలువయని పేరు. దానిమీదనే క్రీస్తును మేకులతో అంటగొట్టి చంపిరి. సిలువవేసి చంపిరి సిలువ అను మాటకు మనవారు కొరతను వేసిచంపిరి అని అందురు. సిలువమీద క్రీస్తు ప్రభువు మన పాపములను భరించెను. మనమీద గల ప్రేమచేత వాటిని సహించెను. మనమీదనున్న పాపములను తనమీద వేసికొనుట

వలన, మనమీదనుండి వాటిని తొలగింపవలెననియే; ఆయన సిలువను వ్రేలాడబడుటకు సమ్మతించెను. గనుక సిలువవలన ఆయనకు శ్రమ గలిగెను గాని మనకు విముక్తి కలిగెను. విశ్వాసులందరును సిలువ ధ్యానముచేయుటకు ఇదియే కారణము. సిలువమీద మనకు బదులుగా చనిపోయిన క్రీస్తు, మానవులందరకు ప్రతినిధియగు మానవుడు గనుక సిలువకును, సర్వ ప్రపంచమునకును గొప్ప సంబంధముకలదు. సిలువమీద నున్న ఆయన దేవుడు గనుక సిలువకును, పరలోకమునకును గొప్ప సంబంధముకలదు. సిలువను గూర్చిన శుభవర్తమానము సర్వలోకమునకును ప్రకటింపవలసిన భారము క్రైస్తవ మతమునకు కలదు. క్రీస్తు సిలువమీద నెరవేర్చినవన్నియు, తన విషయమేయని నమ్మగల విశ్వాసికి; సాతానుయొక్క అధికార విముక్తియు, నరక విముక్తియు గలుగుచున్నది. కనుక ప్రతి విశ్వాసికిని, సిలువకును గొప్ప సంబంధము కలదు. సిలువ జ్ఞప్తికి వచ్చునప్పుడెల్ల నా మీదనుండి కీడు తొలగినదికదా అనికూడ జ్ఞప్తికి వచ్చును.

# 26. క్రీస్తు శిష్యుల సిలువ

సిలువ రెండు విధములు. 1) కర్ర స్తంభమొక సిలువ, 2) బాధ యొక సిలువ. క్రీస్తునకు ఈ రెండు సిలువలును గలవు. ఆయన శిష్యులకు రెండవ విధమైన సిలువగలదు. మన పాపములు, వ్యాధులు, శిక్షలు క్రీస్తు సిలువ వలన తీరిపోయినను, అవి ఆయన శిష్యులను ఇంకను బాధించుచునేయున్నవి. క్రీస్తునకు సర్వజనుల పాపభారము గలిగినందున, ఆయన సిలువ మహా కఠినమైన సిలువ. విశ్వాసి తన ఒక్కడి పాపభారము మాత్రము కలిగియున్నందున,

అతని సిలువ అంత కఠినమైనది కాదు. విశ్వాసి ఇట్లనుకొనును: నా ప్రభువు సిలువయెదుట నా సిలువ ఏ మూల? నా సిలువ వలన రాదగిన కీడు, నా రక్షకుని సిలువవలన హరించి పోయెనుగదా! నా సిలువను సహించుకొనుశక్తి, ప్రభువువలన నాకు కలిగియున్నదిగదా!. క్రీస్తు సిలువ చరిత్ర జరిగిన మూడవనాడు విజయచరిత్ర జరిగినట్లు, నాకును నా సిలువమీద విజయము కలుగునుగదా! నా తండ్రి నా నిమిత్తమై సిలువ మోసెను. ఇప్పుడు నా వంతు. నేను ఆయన నిమిత్తమై సంతోషముతో సిలువను భరింతును. నాకు సిలువలేనియెడల నేను దేవుని చుట్టు తిరుగను ***(విశ్వాసియొక్క సిలువ నాశనకరమైనది కాదుగాని అది విశ్వాసిని విశ్వాసమందు వృద్ధిచేయునట్టి ఒక సాధనమైయుండును).***

## 27. హతసాక్షుల చరిత్ర

చదువరులారా! హతసాక్షుల చరిత్రలు మిరెప్పుడైన విన్నారా? క్రైస్తవేతరులు క్రైస్తవులను తిట్టి పట్టుకొని కొట్టి, క్రీస్తును విడిచిపెట్టుడని వారు ఎంతగా భయపెట్టినను, క్రూర మరణమునకైన ఒప్పుకొనిరిగాని క్రీస్తు భక్తి విడువరైరి. వారు క్రీస్తు నిమిత్తమై శరీర రక్షణ పోగొట్టుకొని మోక్ష లోకములో ప్రవేశించిరి.

## 28. ఆది శిష్యులపని

క్రీస్తుబోధించెను గనుక వారును బోధించిరి. క్రీస్తు శత్రువులను క్షమించెను. వారును ఆలాగే క్షమించిరి. క్రీస్తు, మందులేకుండా రోగులను బాగుచేసెను. వారును అట్లు చేసిరి. క్రీస్తు దయ్యములను

వెళ్ళగొట్టెను. వారును ఆ విధముగనే వెళ్ళగొట్టిరి. క్రీస్తు మృతులను బ్రతికించెను వారును బ్రతికించిరి.

# 29. నేటి క్రైస్తవమతముయొక్క పని

క్రీస్తు ప్రభువును, శిష్యులును చేసినపనులే నేటిక్రైస్తవ మతము కూడ చేయుచున్నది. గాని పద్ధతులు భేదముగానున్నవి.

# 30. బోధపని

సర్వ ప్రపంచమునకు క్రైస్తవ మతము మిషనెరీలను పంపుచున్నది. పాఠశాలలలో లౌకిక విద్య నేర్పు సమయముననే, మతబోధకూడ చేయుచున్నది. ఆస్పత్రులలో ఔషధములిచ్చుచు రోగులకు బోధ వినిపించుచున్నది. గ్రంథములు, పత్రికలు అచ్చువేయించి, సువార్త బోధించుచున్నది. సభలుచేసి, ఉపన్యాసముల మూలముగ క్రీస్తును ప్రకటించు చున్నది. ప్రతి గ్రామమునకు వెళ్ళి సువార్తను బోధించి అనేకమందిని దేవునితట్టు త్రిప్పుచు, మత సంఘములను స్థాపించుచున్నది.

# 31. స్వస్థతకార్యము

వ్యాధులను గురించియు, ఔషధములను గురించియు పరిశీలన చేయుచు, ఆస్పత్రులు స్థాపించుచు, అనేకులకు మహోపకారము చేయుచున్నది. క్రీస్తు శరీరాత్మల వైద్యుడని వివరించుచున్నది.

# 32. వివిధోపకారములు

బీదలను పోషించుచున్నది. కష్టస్థితిలో నున్నవారిని ఆదరించుచున్నది. ఏది చేసినయెడల ప్రజలకు ఉపకారమో అది

చేయుటలో పాల్గొనుచున్నది. సర్వలోక రక్షణార్థమై ప్రార్థించుచున్నది, ఋజువు చేయుచున్నది.

**దేవుడు మిమ్ములను దినదినము దీవించునుగాక. మరనాత.**

# విచారణ

ఎవరు ఏది చెప్పినను మొదటిసారి వినవలెను. తర్వాత అది ఎంత వరకు నిజమో! దేవుడిచ్చిన జ్ఞానమునుబట్టి ఆలోచింపవలెను. ఆ తర్వాత చెడుగును విసర్జింపవలెను, మంచిని అవలంభించవలెను. ఏదియు వినకముందు నేరస్థాపన చేయకూడదు. ఆలాగే మంచిదని నిర్ధారణ చేయుగూడదు. ఎన్నిమారులు విన్నను, ఎంత ***ఆలోచించినను, సత్యాసత్యములు నిర్ణయింప వీలులేనప్పుడు దేవుని ప్రార్థింపవలెను.*** దేవుడే మీ హృదయమునకు సత్యమును బయలుపరచును. అసత్యమును తెలిసికొనక పోయినయెడల హాని కలుగును. సత్యమును తెలిసికొననియెడల కలుగవలసిన మేలు కలుగదు. గనుక పరీక్ష అవసరమే. క్రైస్తవ మతవిషయములు ఎవరివలననో ఒకరివలన మీరిదివరకే వినియుందురుగాని, నేనెట్లు చెప్పుదునో అది మీరు వినలేదు. గనుక దయచేసి ఇప్పుడు వినండి. కడవరకు వింటేనే గాని మీరు సత్యమును గ్రహించలేరు, లేనిచో మీకనేక సందేహములు కలుగుచుండును. మరనాత.

# స్వస్థి ప్రార్థన పద్ధతి
## (జబ్బున్నవారికి)

I. ప్రియులారా! ఎంతో కాలమునుండి ప్రార్థించుచున్నను జబ్బు కుదరలేదు. ఎందుచేత? జవాబు: మనోనిదానము కుదరనప్పుడును, పొరపాటులు న్నప్పుడును, సరియైన నమ్మికలేనప్పుడును, ప్రార్థన నెరవేరనందున విసుగుదల కలిగినప్పుడును, వ్యాధి నివారణ కాదు.

II. మాకు మనోనిదానము కుదిరినది, పొరబాటులేకుండ చేసికొన్నాము, విసుగుదల లేదు. అయినను ఎందుచేత వ్యాధికుదరలేదు? జవాబు: అలాగైన నేను కొన్ని సలహాలిచ్చుచున్నాను అట్లుచేసి చూడండి. అవేమనగా,

1) వీలైన ఒకదినము ప్రార్థనకు ఏర్పరచుకొని, ఉదయము మొదలుకొని సాయంకాలము వరకు, బైబిలులో నీ ఇష్టము వచ్చిన వాక్యములు చదువుకొనండి. అప్పుడును జబ్బు కుదరనియెడల,

2) మరియొక దినము ఏర్పరచుకొని, మీ కష్టమంతయు వివరించుకొనుచు ప్రార్థనలో గడపండి. అప్పుడును జబ్బు కుదరనియెడల, 3) మరియొక దినము ఏర్పరచుకొని ఇష్టమువచ్చిన క్రైస్తవ కీర్తనలు పాడుకొనండి. అప్పుడు ఇంకను జబ్బుకుదరకున్న యెడల, 4) కలిగియున్న ఇబ్బందులు, శత్రుబాధలు, చిక్కులు, గండములు మొదలగు వానిని తప్పించిన దేవుని విమోచన ఉపకారములు తలంచుకొని ఆయనను స్తుతించండి. అప్పుడును జబ్బు కుదరనియెడల, 5) ఇదివరకు దేవుడు చేసిన

సదుపాయోపకారములు తలంచుకొని, సంతోషముతో ఆయనను స్తుతించండి. అప్పుడును జబ్బు కుదరనియెడల, 6) మరియొక దినమేర్పరచుకొని దైవ సన్నిధిలో మౌనముగా నుండండి. అప్పుడు దేవుడు, మీ మనస్సులో సంతోషకరమైన తలంపులు కలిగించును. ఏమిచేయవలెనో తోచును. అప్పుడును జబ్బు కుదరనియెడల,

7) మరియొక దినము ఉపవాస దినముగా ఏర్పరచుకొని, ఉదయము మొదలుకొని సాయంకాలము వరకు దేవుడు ఏ జబ్బులు పోగొట్టెనో ఆ వచనములు బైబిలులో చదవండి. కొందరికి ఉపవాసముపడదు, గనుక చేయకూడదు. ఆది 20:17, నిర్గమ 15:26, సంఖ్యా 12:10-14, 21:4-9, 1రాజులు 13:4-6; 17:17-24, 2రాజులు 4:1-7, 4:32-37, 5:7-14, 20:1-7, 2దిన 7:14, 16:12-14, యోబు 33:25, కీర్తనలు 6:2, 30:2, 41:3, 92:15, 103:1-5, 107:20, సామెతలు 3:7-8, 4:20-22, యెషయా19:22, 38:1-9, 53:4-5, యిర్మియా 17:14, జెకర్యా 12:5, మలాకి 4:2, మత్తయి 4:23,24, 8:2-13, 9:2-8, 20-22, 27-31, 12:9-15, 14:34-36, 15:29-31, 19:1-2, 20:29-34, 21:14, 26:51, మార్కు 1:40-45, 2:1-12, 3:1-11, 5:25-29; 34:6,35-42, 6:53-56; 7:31-37, 8:22-26, 10:46-52; 14:47, లూకా 5:12-26, 6:18,19, 7:1-10, 8:43-48, 13:10-17, 14:1-6, 18:9-17, 18:35-43, 22:50-51, యోహాను 4:46-54, 5:1-9, 10:38, 18:10-11, కార్య 3:1-10, 5:15-16 9:15-18, 32-35, 14:7-11, 19:12, 28:5-9; 1పేతురు 2:24. లోకములో జరుగుచున్న స్వస్థత కార్యములున్న చరిత్రలు దొరికిన యెడల

అవికూడ చదువుకొనండి. అప్పుడును వ్యాధి కుదరనియెడల, 8) మరియొక పనిచెయ్యండి: ఇది మిశ్రమ కార్యము. ఏలాగనిన కొంతసేపు దేవునియెదుట మీ అయోగ్యత ఒప్పుకొనండి, కొంతసేపు కీర్తనలు పాడుకొనండి, కొంతసేపు బైబిలు చదువుకొనండి, కొంతసేపు ప్రార్థించండి, కొంతసేపు స్తుతించండి. తక్కిన సమయమంతయు మౌనముగా నుండి కనిపెట్టుటలో గడపండి. దేవుని తలంపే కలిగియుండండి. మీ జబ్బును తలంచుకొనరాదు. అప్పుడును జబ్బుకుదరని యెడల, 9) తెలిసిన ఎవరిచేతనైన ప్రార్థన చేయించుకొనండి. అప్పుడును జబ్బు కుదరని యెడల, 10) ఈ దిగువనున్న ప్రార్థనవంటి ఒక ప్రార్థన సిద్ధపరచుకొని అనుదినము చేయుచు, స్వస్థత కొరకు కనిపెట్టుకొని యుండండి. కీర్తన 2:3 దేవా! యేసుక్రీస్తు ప్రభువా! నా నిమిత్తమై శరీరధారివై, భూలోకమున వెలసిన తండ్రీ! నీ కనేక వందనములు. నీ దైవత్వమును, నీ దివ్య లక్షణములను, బైబిలులో వ్రాయించిన నీ వాగ్దానములను, నీవు మా భూమిమీద రోగులకు చేసిన ఉపకార కార్యములను, మా పాపములు వ్యాధులు శిక్షలు వహించి పరిహరించుటకై, నీవు సిలువ మ్రాను మీద మహాయజ్ఞమై, ప్రాణ సమర్పణ చేసిన వృత్తాంతమును, సాతానును, దయ్యములను, పాపములను, పాప ఫలితములను, మరణమును జయించి పునరుత్థాన మొంది ఆరోహణమైన అద్భుత చరిత్రను ఆధారముచేసికొని, నా జబ్బు బాగుచేయుమని నిన్ను వేడుకొనుచున్నాము. పూర్వకాలమందు మాత్రమేకాక నీవు దేవలోకమునకు వెళ్ళిన గడియ నుండి నేటివరకు, నీ విశ్వాసులు చేసిన ప్రార్థనలు ఆలకించి ప్రజల వ్యాధులు పరిహరించు చున్నావు. కనుక నీకనేక వందనములు. నా

పాపములు, నా జబ్బులు పరిహరింతువని దృఢముగా నమ్మియున్నాను. నీకే కీర్తి, నన్ను నీ సేవలో వాడుకొనుము.

III. ప్రార్ధన నెరవేరని అన్నిదినములు బాధపడుచుండ వలసినదేనా? ఔషధములు వేసికొనకూడదా? జవాబు: ప్రార్థించి, తోచిన మందువేసి కొనవచ్చును. గాని దీవించువాడును, స్వస్థపరచువాడును ప్రభువే అని ఆయననే ఆశ్రయింపవలెను. IV. ఈ పత్రిక వ్యాధిగ్రస్తుల కొరకేనా? లేక ఇతరుల కొరకుకూడానా? జవాబు: అందరి కొరకును ఏ అంశమును గూర్చి ప్రార్థింపవలసి వచ్చినను ఇదే పద్ధతి. V. ఇంత ప్రయాసపడితేనేగాని దేవుడు వినడా? జవాబు: ***ఇంత ప్రయాసపడుట దేవునిని రక్షించుటకు కాదు, మిమ్మును రక్షించుకొనుటకే.*** మీ హృదయములు స్వస్థత కొరకు సిద్ధపడుటకే. VI. ప్రార్ధన రానప్పుడేమి చేయవలెను? జవాబు: ఇదివరకు చేసిన ప్రార్ధనమాటలే ఉపయోగింపవచ్చును. అవి మీకు మధురముగా లేనప్పుడు, దైవసన్నిధిలో కనిపెట్టుకొని యుండండి. చదువరులారా! మీకు నచ్చినది చేయండి. మిమ్మునుగూర్చి మాత్రమేకాక లోకస్థులందరిని గురించియు, అన్ని విషయములను గురించియు ప్రార్థించండి. కన్నీటి ప్రార్థన నరుని కఠిన మనస్సును కరిగించును. మిమ్మును మోక్షమందు చేర్చగల క్రీస్తుప్రభువు మీ జబ్బులు పోగొట్టలేడా? నమ్మిక కలుగనియెడల నమ్మి చూడరాదా? ప్రార్థించి చూడరాదా? మమ్మును దీవించిన దేవుడు మిమ్మునుకూడ దీవించునుగాక! ఆమేన్. మరనాత.

# దైవిక స్వస్థిజాబితా

1. అద్భుతము, 2. అద్భుత కారకుడు, 3. దైవప్రార్ధ నాపరులు, 4. ప్రార్థన, 5. విజ్ఞాపనపరులు, 6. ప్రభుని పలుకులు, 7. సాధనము, 8. రోగి విశ్వాసము, 9. స్థలము, 10. కధా సందర్భము, 11. రిఫరెన్సు, 12. ఫలితము, 13. పేరు, 14. వ్యాధిగ్రస్తులు.

1. ఆదాముకు శస్త్రముచేసి బాగుచేయుట, అద్భుతకరుడగు యెహోవా ఏదేను తోటలో ఆదికాండము 2:21,22. స్త్రీ నిర్మాణము గావించుట.
2. సంతానహీనత బాగుచేయుట. ఆది. 20:7,8.
3. మిర్యాము కుష్టురోగము బాగుపడుట. సంఖ్యా. 12:10-16.
4. తెగులు ఆపుట. సంఖ్యా. 16:41-48.
5. పాముకాటును బాగుచేయుట. సంఖ్యా. 21:4-9.
6. ఎండినచేయి బాగుచేయుట. 1 రాజు. 13:4-6.
7. ఒక బాలుని బ్రతికించుట. 1 రాజు. 17:17-24.
8. ఒక బాలుని బ్రతికించుట. 2 రాజులు. 4:8-32, 37.
9. కుష్టు రోగము బాగుచేయుట. 2 రాజులు. 5:1-9.
10. ఒక సిపాయి బ్రతుకుట. 2 రాజులు. 13:20,21.
11. పుండు బాగుచేయుట. 2 రాజులు. 20:1-7.
12. అగ్ని కాలకుండ చేయుట. దానియేలు 3వ అధ్యాయము.

Bible Mission HQ Guntur

# యేసుక్రీస్తువారి స్వస్థత అద్భుతములు

1. జ్వరమును బాగుచేయుట. యోహాను 4:46-54.
2. అపవిత్రాత్మను వెళ్ళగొట్టుట. మార్కు 1:23-26; లూకా 4:30-35.
3. కుష్టరోగము బాగుచేయుట. మత్తయి 8:2-4; మార్కు 1:10-45; లూకా5:12-16.
4. స్వస్థత కూటములు జరిగించుట. మత్తయి. 4:23,24; మార్కు 1:38-49; లూకా 4:42-44.
5. పక్షవాతరోగము గలవారిని బాగుచేయుట. మత్తయి 9:2-8; మార్కు 2:1-12; లూకా 5:17-26.
6. వ్యాధిగ్రస్తుని బాగుచేయుట. యోహాను 5:1-9.
7. ఊచచెయ్యిగల వారిని బాగుచేయుట. మత్తయి. 12:9-14; మార్కు 3:1-6; లూకా 6:6-11.
8. స్వస్థతకూటము. మత్తయి 12:15-16; మార్కు 3:7-11.
9. పక్షవాయువు రోగమును బాగుచేయుట. మత్తయి 8:5-13; లూకా 7:1-10.
10. మృతుడైన నాయీను వాస్తవ్యుని బ్రతికించుట. లూకా 7:11-17.
11. పాప రోగమును బాగుచేయుట. లూకా 7:36-50.

Bible Mission HQ Guntur

12. గ్రుడ్డి, మూగ, దయ్యములను వెళ్ళగొట్టుట. మత్తయి 12:22-24; మార్కు 8:22-25.

13. దయ్యములు పట్టిన వారిని బాగుచేయుట. మత్తయి 8:28-34; మార్కు 5:1-20; లూకా 8:26-39.

14. రక్తస్రావ రోగమును బాగుచేయుట. మత్తయి 9:20-22; మార్కు 5:25-34; లూకా 8:43-48.

15. యాయీరు కుమార్తెను బ్రతికించుట. మత్తయి 9:18,19, 23-26; మార్కు 5:22-24, 35-43. లూకా 8:41,42, 49-56.

16. ఇద్దరు గ్రుడ్డివారిని బాగుచేయుట. మత్తయి 9:27-31.

17. మూగ దయ్యముపట్టిన వారిని బాగుచేయుట. మత్తయి 9:32-34.

18. స్వస్థతకూటము చేయుట. మత్తయి 14:34-36; మార్కు 6:53-56.

19. దయ్యముపట్టిన బాలికను బాగుచేయుట. మత్తయి 15:21-27; మార్కు 5:35-42.

20. చెవుడు, నత్తిగలవానిని బాగుచేయుట. మార్కు 7:31-37.

21. స్వస్థతకూటము పెట్టుట. మత్తయి. 15:29-31.

22. గ్రుడ్డివానిని బాగుచేయుట. మార్కు. 8:22-26.

23. దయ్యముపట్టిన వానిని బాగుచేయుట. మత్తయి 17:14-21; మార్కు 9:17-27; లూకా 9:37-43.

24. పుట్టు గ్రుడ్డివానిని బాగుచేయుట. యోహాను 9:1–11.

25. మూగ దయ్యమును బాగుచేయుట. లూకా 11:14–15.

26. బలహీనురాలిని బాగుచేయుట. లూకా 13:10–17.

27. జలోదరరోగమును బాగుచేయుట. లూకా 14:1–6.

28. లాజరును బ్రతికించుట. యోహాను 11:1–44.

29. పదిమంది కుష్టరోగులను బాగుచేయుట. లూకా 17:11–19.

30. స్వస్థతకూటము చేయుట. మత్తయి 19:1–2; మార్కు 10:1.

31. గుడ్డిబర్తిమయిని బాగుచేయుట. మత్తయి 20:29–34; మార్కు 10:46–52; లూకా 18:35–43.

32. స్వస్థత కూటములు. మత్తయి 11:4,5.

33. చెవి నరకబడిన వారిని బాగుచేయుట. మత్తయి 26:51; మార్కు 14:47: లూకా 22:50; యోహాను 18:10,11.

34. పరిశుద్ధులు బ్రతికివచ్చుట. మత్తయి 27:52.

35. కుంటివానిని బాగుచేయుట. అపో.కార్య. 3:1–10.

36. స్వస్థత కూటము జరిగించుట. అపో.కార్య. 5:15,16.

37. స్వస్థత కూటము పెట్టుట. అపో.కార్య. 8:1–8.

38. కండ్లజబ్బు బాగుచేయుట. అపో.కార్య. 9:10–18.

39. పక్షవాయువు రోగిని బాగుచేయుట. అపో.కార్య. 9:32–35.

40. చనిపోయిన స్త్రీని బాగుచేయుట. అపో.కార్య. 9:36-42.

41. కుంటివానిని బాగుచేయుట. అపో.కార్య. 14:7-11.

42. దయ్యములను వెళ్ళగొట్టుట. అపో.కార్య. 16:16-18.

43. స్వస్థత కూటము. అపో.కార్య. 19:12.

44. మృతుని బ్రతికించుట. అపో.కార్య. 20:9-12.

45. పాముకాటును బాగుచేయుట. అపో.కార్య. 28:1-6.

46. జ్వరము, రక్తభేదిని గద్దించుట. అపో.కార్య. 28:7-9.

47. స్వస్థత కూటము జరిగించుట. అపో.కార్య. 28:9-10.

# దైవిక స్వస్థత (అపో.కార్య. 3:16)

**1.** **ప్రశ్న:** దైవిక స్వస్థత అనగానేమి?

జవాబు: వ్యాధిని బాగుచేయుటకు వైద్యునకు ఇవ్వవలసిన సమయము, దేవునికి ఇవ్వగా ఆయన ఔషధము వేయకుండ తన ప్రభావమువల్ల రోగిని బాగుచేయును. దీనినే దైవికస్వస్థత అని అందురు.

**2.** **ప్రశ్న:** దేవుడు దేనిచేత బాగుచేయును?

జవాబు: కొందరు బైబిలు చదువుకొనుటవల్ల బాగుపడుదురు. కొందరు స్తుతి చేయుటవల్ల బాగుపడుదురు. కొందరు 'ప్రభు యేసు రక్తమునకు జయమని' చెప్పుటవల్ల బాగుపడుదురు. కొందరు- దేవుడు నా జబ్బు బాగుచేసినాడని నమ్మి, రోగమును మరచివెళ్ళుటవల్ల బాగుపడుదురు కొందరు

ప్రభుయేసు పేరు ఉచ్ఛరించుట వల్ల బాగుపడుదురు. (అనగా యేసు నామమువల్లనే రక్షణ) 'ఈ నామమువల్లనే రోగ నివారణ' అని పలుకుటవల్ల బాగుపడుదురు. కొందరు ప్రభువు భోజనము పుచ్చుకొనుటవల్ల బాగుపడుదురు. కొందరు వ్యాధి ఉన్నను, పక్షవాయువు రోగివలె నడచుటవల్ల బాగుపడుదురు. కొందరు ప్రార్థనలో కనిపెట్టుటవల్ల బాగుపడుదురు. కొందరు నమ్మి బాగుగా నిద్రపోవుటవల్ల బాగుపడుదురు. కొందరు దేవునిమీద ఆనుకొని, ఆయన దీవెనకోరి ఔషధము వేసికొని బాగుపడుదురు. 'ఓ వ్యాధీ! పిశాచీ! క్రీస్తుప్రభువు నిన్ను వెళ్లగొట్టుటకు మాకు అధికారము ఇచ్చినాడు' అని పలుకుటవల్ల బాగుపడుదురు. కొందరు విశ్వాసముతో పత్యపుకూరలు మాని, సామాన్యాహారము సంతోషముతో భుజించుటవల్ల బాగుపడుదురు. కొందరు స్తుతి కీర్తనలు పాడుటవలన బాగుపడుదురు. కొందరు విశ్వాసులను పిలిచి, ప్రార్థనను పెట్టుకొనుట ద్వారా బాగుపడుదురు. కొందరు ప్రభువును అడిగి స్వప్నములోనో, దర్శనములోనో తెలియబడిన మందులువేసికొని బాగుపడుదురు. కొందరు బైబిలులోని స్వస్థత వాక్యములన్నియు చదువుట వల్ల బాగుపడుదురు. కొందరు ప్రభువు దర్శనములో ముట్టుకొన్నట్టు చూచి బాగుపడుదురు. కొందరు ప్రభువు యొక్క సన్నిధి నాయొద్దగలదు అని స్పర్శజ్ఞానమువల్ల తెలిసికొని బాగుపడుదురు. ఒకరికి తీవ్రమైన జ్వరమువచ్చినప్పుడు– 'ఓ పిశాచీ! నీవు నన్ను గెలువవలెనని వచ్చినావా? నేను గెలువలేననుకొన్నావా? ప్రభువే నా వైద్యుడు పో!' అని పలుమార్లు మంచము మీద ఇటు అటు దొర్లుచు

బాగుపడిరి. ఒక రోగికి ప్రభు ప్రార్థనచెప్పి, చేయించగా బాగుపడిరి. ఒకరు ప్రభు యేసునందు నీకిచ్చుచున్న ఈ నీళ్ళు త్రాగుమని చెప్పగా త్రాగి బాగుపడెను. ఒకరు మిక్కిలి జబ్బుగానున్నప్పుడు, ఒక విశ్వాసికి కబురు పంపిరి. ఆయన ఇంకను దారిలో యుండగానే వ్యాధి తగ్గనారంభించెను.

**షరా:-** సమస్తమును విశ్వాసమునుబట్టియు, ప్రభువు నామ స్మరణనుబట్టియు నుండును. ఒకరు ప్రభువు నామమున స్నానముచేసి బాగుపడిరి. కొందరు బాప్తిస్మము పొంది బాగుపడిరి. కొందరు ఉపవాస ప్రార్థనలో బాగుపడిరి. ఇవి అనుభవ చరిత్రలు. విశ్వాసీ! నీ అనుభవము ఎట్లున్నదో చూచుకొనుము.

**3.** **ప్రశ్న:** కొందరు, ఎన్ని ప్రార్థనలు చేసినను, జబ్బులు పోవుటలేదు, ఎందుకో?

జవాబు: ఆత్మీయ జీవితములో ఏదోయొక బలహీనతయుండుట ఒక కారణము. గత కాలమందు ఒకరికి విరోధముగా చేసిననేరము, వారియొద్దకు వెళ్ళి ఒప్పుకొనకపోవుట ఒక కారణము. ప్రభువును పూర్తిగా నమ్మకపోవుట ఒక గొప్ప కారణము. ప్రార్థన చాలకపోవుట ఒక కారణము. వ్యాధికాలమున- ప్రభువు ఆదుకొనే సమయమైయున్నది గనుక ఆ సమయము అయిన తరువాత స్వస్థత కలుగును. శ్రమలు మానవుని ఉపయోగార్థమై, దేవుడు వాడుకొను సాధనములై యున్నవని విశ్వాసి మరువరాదు. వ్యాధి సమయము దేవుడు మాట్లాడే సమయము, దిద్దుబాటు

సమయము. శిక్ష రక్షణను అందించే సమయము, జ్ఞానోపదేశ సమయము, విశ్రాంతి సమయము, ఇతరుల పరిచర్య లక్షణము వెల్లడియగు సమయము, ప్రార్థన స్తుతుల సమయము, ఇంత విలువైన సమయమును, అపవాది విసుగుదల సమయముగా వాడుకొనును. కనుక మెళకువగా నుండండి. 'ఇంకను జబ్బు ఎందుకు పోలేదు? దేవునికి నామీద దయలేదు. ఇంతమంది ప్రార్థనలు ఏ నీట కలిసిపోవుచున్నవో? ప్రార్థన మానివేస్తే బాగుండును' అని ఇటువంటి మాటలు అనుకొనుటవల్ల జబ్బుపోదు. జబ్బుకాలము పరలోకముయొక్క మహిమకును సిద్ధపడేకాలము.

4. **ప్రశ్న:** జబ్బు బాగుచేయుట ప్రభువుకు ఇష్టమో, కాదో మాకెట్లు తెలియును?

జవాబు: ఇష్టముకలదనియు, శక్తికలదనియు మత్తయి 8వ అధ్యాయమువల్ల తెలిసికొనవచ్చును. ఇది విశ్వాసికి ఆదరణగా ఇవ్వబడిన అధ్యాయమని చెప్పుదురు. నరుడు జన్మింపకముందే, భూమ్యాకాశములు అతని సదుపాయము నిమిత్తమై కలుగజేసిన దేవుని ప్రేమకు, ఇష్టము ఉండదా? ఇంత పెద్దలోకమును కలుగజేసిన దేవుని శక్తికి, శక్తి యుండదా?

5. **ప్రశ్న:** జబ్బును బాగుచేయుట బైబిలులో నున్నది. కాని అది పూర్వకాల అద్భుతముగాని నవీన కాలాద్భుతము గాదు. ఇది నిజమా?

జవాబు: బైబిలు అన్ని కాలములకు వ్రాయబడియున్నది. అవుననే వారికి అవును, కాదనేవారికి కాదు! క్రీస్తు ప్రభువు అన్ని కాలములకు రక్షకుడైయున్నాడు. శరీరాత్మల వైద్యుడై యున్నాడు.

6. ప్రశ్న: ఒకరు అన్ని షరతుల ప్రకారము చేసినను బాగుకాలేదేమి?

జవాబు: గడిచిన కాలమందు దేవుడు చేసిన మేళ్ళు తలంచుకొని కృతజ్ఞత కనబరచినాడా? లేదు. దైవ లక్షణములను కొనియాడినాడా? వాక్యమును, కుమారుని యాత్మను ఇచ్చినావు తండ్రీ! నీకు స్తోత్రములు అని చెప్పినాడా? లేదు. అందుచేతనే పోలేదు.

**7.** **ప్రశ్న:** ఇవన్నియు చేసినను, ఒకరికి పోలేదు ఎందుకు?

జవాబు: ***'ప్రభువా! నీ ప్రేమనుబట్టి జబ్బు రానిచ్చినావు'*** అని స్తుతించలేదు అందుచేతనే పోలేదు.

**8.** **ప్రశ్న:** జబ్బులు బాగుచేయించుకొనగోరువారు ఏమిచేయవలెను?

జవాబు: మిత్ర, స్వస్థి పత్రిక, సదర్ధము, ప్రార్థనమెట్లు, వారబోధిని, దైవసన్నిధి, రాకడ ధ్వని, ప్రకటన వివరము, పరమగీత వివరము, విమలాత్మ ప్రోక్షణము, ఆరాధన క్రమము, తెలుగు క్రైస్తవ కీర్తనలు, ఇవన్నియు బైబిలు మిషనుయొక్క వ్రాతలై యున్నవి. ఇవి చదువుట మంచిది.

**9.** **ప్రశ్న:** దేవుడే జబ్బును పంపుచున్నాడనుచున్నారు, ఇది నిజమా?

జవాబు: దేవుడే జబ్బులు పంపితే వ్యాధులు బాగుచేసికొను మూలికలు ఎందుకు సృజించెను? వాగ్దానములు, స్వస్థత చరిత్రలు, బైబిలులో ఎందుకు వ్రాయించెను? ప్రభువు సిలువ మ్రానుమీద మన వ్యాధులను ఎందుకు భరించెను? (యెషయా 53, మత్తయి 8) వ్యాధి ఆయనే పంపితే, మనిషి పూర్తిగా నశించును. దేవుడు తన సృష్టికి హాని చేయునా? తండ్రి, తన బిడ్డలను నాశనము చేయగలడా? రోగులను బాగుచేసెనను బైబిలు కథలు, దయ్యములు వెళ్ళగొట్టెనను బైబిలు కథలు చదువువారు, దేవుడు వ్యాధులకు కారకుడని చెప్పలేరు.

**10. ప్రశ్న:** విశ్వాసము లేకపోతే జబ్బు పోదా?

జవాబు: పోదు.

**11. ప్రశ్న:** అట్లయితే క్రీస్తుకంటే విశ్వాసము గొప్పదా?

జవాబు: విశ్వాసము, క్రీస్తు ప్రభువు అనుగ్రహించునట్టి స్వస్థతను అందుకొనే హస్తమై యున్నది.

**12. ప్రశ్న:** వ్యాధికి కారకుడెవరు?

జవాబు: సాతానులో నుండి పాపము వచ్చినది. ఆ పాపమువల్ల వ్యాధి, ఇబ్బంది, నష్టము, హాని, మరణము, తుదకు నరకము ఇవన్నియు వచ్చెను. పాపమువల్లనే అజాగ్రత్త, అశుభ్రత, అనాగరికత, అనాచారము, అజ్ఞానము ఈ మొదలైనవి వచ్చెను.

**13.** **ప్రశ్న:** ముల్లు గ్రుచ్చుకొనుట, పడిశము పట్టుట, వేడిచేయుట, ఇవికూడ పాపఫలితములేనా?

జవాబు: పాపఫలితములగు అజాగ్రత్తలు వీటికి కారణములు.

**14.** **ప్రశ్న:** రాజైన ఆసా మందు వేసికొనుటవల్ల శిక్షనొందెననుట నిజమా?

జవాబు: దేవునిని ఆశ్రయింపక, వైద్యులను ఆశ్రయించుటవల్ల శిక్ష కలిగెను. 'నాకు వేరుగానుండి మీరేమియు చేయలేరు' అని ప్రభువు చెప్పినమాట జ్ఞాపకముంచు కొనవలెను.

**15.** **ప్రశ్న:** మార్కు 5:27,28 ప్రకారము వస్త్రము ముట్టుకొనుట వల్లను, అపో.కార్య. 5:15,16లో ఉన్నట్లు విశ్వాసుల నీడపడుట వలనను రోగులు బాగైనారనుట నిజమా?

జవాబు: ప్రభువుయొక్క అంగీ ముట్టుకొనుట వల్ల ఒక రోగి యొక్క వ్యాధి అంతరించెను. ఇది విశ్వాసమునుబట్టి కలిగెను (లూకా. 8:44).

**16.** **ప్రశ్న:** ప్రభువు బాగుచేసినట్లు విశ్వాసులు ఇప్పుడు బాగుచేయకూడదా?

జవాబు: ఇది ఇప్పుడును కొందరిద్వారా జరుగుచున్నది. పేతురు వచ్చుచుండగా జనులు రోగులను వీధులలోనికి తెచ్చి, వారిలో ఎవరిమీదనైనను అతని నీడయైనను పడవలెనని మంచములమీదను, పరుపులమీదను వారిని

ఉంచిరి. మరియు యెరూషలేము చుట్టునుండు పట్టణపు జనులు రోగులను అపవిత్రాత్మలచేత పీడింపబడిన వారిని మోసికొని వచ్చిరి. **'వారందరు స్వస్థత పొందిరి'** అని అపో.కార్య. 5:15,16లో చూడగా నేటి విశ్వాసులకు కూడ అట్టి స్వస్థత కూటములు పెట్టవలయునను ప్రేరేపణ కలుగక మానదు.

**17.** **ప్రశ్న:** ఇది స్వస్థతవరము పొందినవారివలననే గాక మరి ఎవరివల నైనను జరుగదా?

జవాబు: విశ్వాసుల అందరివల్ల జరుగునుగాని కొందరు వరము నిమిత్తమై ప్రయత్నము చేస్తే బాగుండును. అట్టివారు స్వస్థతను గూర్చిన పుస్తకములు చదువవలెను. రక్షణ సంకల్పన, ప్రార్థనమెట్లు, స్వస్థి పత్రిక, ఈ మూడు చదివినవారు ఈ పని చేయగలరు.

**18.** **ప్రశ్న:** విశ్వాసమువల్ల పూర్ణ ఆరోగ్యము కలుగునా?

జవాబు: ఆయన నీ దోషములన్నిటిని క్షమించువాడు, నీ సంకటములన్నిటిని కుదుర్చువాడు. పక్షిరాజు యౌవనము వలె నీ యౌవ్వనము క్రొత్తదగునట్లు మేలుతో నీ హృదయము తృప్తిపరచుచున్నాడు (కీర్తన. 103:1–5).

**19.** **ప్రశ్న:** ప్రభువువద్దకు వచ్చువారందరు బాగుపడిరా?

జవాబు: 'ఈ జబ్బు బాగుచేయుట నావల్లకాదు. నిన్ను బాగుచేయుట నా కిష్టములేదు' అని ఆయన ఎవరితోను అనలేదు.

**20.** **ప్రశ్న:** విశ్వాసము లేనివారినెవరినైన బాగుచేసేనా?

జవాబు: తాను దేవుడైయున్నాడని కనబరచునట్లు ఒకరిని బాగుచేయడము ఇది బహు ఆశ్చర్యకరమైన కథ. పేతురుచే నరుకబడిన మల్కు చెవిని ప్రభువు వెంటనే బాగుచేసెను.

**21.** **ప్రశ్న:** ప్రభువు బాగుచేసిన వారందరిలో విశ్వాసముండెనా?

జవాబు: 1) పిచ్చివాడు నమస్కరించెను. అదే విశ్వాసము. 2) గ్రుడ్డివారు నమ్ముచున్నామనిరి. అదే విశ్వాసము. 3) చెవిటి నత్తివాడు, వచ్చెను. ఇదే విశ్వాసము. 4) ఎండిన చెయ్యిగలవాడు ఊచచెయ్యి చాచెను. ఇదే విశ్వాసము. 5) కుంటివానిని నడువుమని చెప్పగా నడిచెను. ఇదే విశ్వాసము. జలోదర రోగిని ఆయన చేరదీయగా చేరెను. ఇదే విశ్వాసము. 7) జ్వరము వచ్చిన నీ కుమారుడు బాగాయెనని ప్రభువు చెప్పెను. తండ్రి నమ్మెను. వెళ్ళిపోయెను. ఇదే విశ్వాసము. 8) కుష్టురోగులు ప్రభువు ఆజ్ఞచొప్పున వెళ్ళిపోయిరి. అదే విశ్వాసము. 9) పక్షవాత రోగితో ప్రభువు పరుపెత్తుకొని నడువుమని చెప్పగా నడిచెను. చెప్పినట్లు చేయుట విశ్వాసము. 10) రక్తస్రావరోగి వస్త్రము ముట్టుకొంటే బాగుపడుదుననుకొనెను. ఇదే విశ్వాసము. 11) బలహీనురాలిని ప్రభువు లేవనెత్తెను, విడుదల రాకముందే ఆమె నమ్మెను. ఇదే విశ్వాసము. 12) మల్కు చెవిని ప్రభువు బాగుచేసెను. అది నరుకబడిన చెవి అయినను, ఆయనను చేయనిచ్చుటే విశ్వాసము.

**22.** **ప్రశ్న:** ప్రభువే వైద్యుడని ఎక్కడైనా నున్నదా?

జవాబు: ఆయన సమస్త రోగములను, దయ్యములను పట్టిన వారిని బాగుచేసెను (మత్తయి 4:24).

**23.** **ప్రశ్న:** విశ్వాసము లేకుండా ప్రయత్నిస్తే జబ్బుపోదా?

జవాబు: పోదు. నమ్మిన ఇశ్రాయేలీయులు పాయలోబడి వెళ్ళుటచూచి, ఐగుప్తీయులును వెళ్ళిరిగాని మునిగిపోయిరి. వారికి దేవునియందు విశ్వాసములేదు గాని, నీటి గోడలమీద విశ్వాసము గలదు.

**24.** **ప్రశ్న:** ఒకానొకప్పుడు ప్రార్థించిన కొలది వ్యాధి ఎక్కువగును. ఎందుచేత?

జవాబు: దయ్యమునకు కోపము గనుక. నీయొక్క విశ్వాసమును పరీక్ష స్తుతియొక్క పురి ఎక్కించుచునే యుండును.

25. ఒక స్త్రీ ఇట్లనెను. వ్యాధి పోలేదని నా శరీరము చెప్పుచున్నది. వ్యాధి పోయినదని వాక్యము చెప్పుచున్నది. ఏది నిజము? అని ఇట్లు చెప్పుచు లేచి నడిచినది. కొన్ని మార్లు పడినదిగాని తుదకు జబ్బు పోయినది. ఈ కథ ఒక బోధకుడు చెప్పినాడు. ఇది జరిగినకథ అంటారా? అవును, అందుకు సందేహమేమి? వాక్యమే నిజము. గనుక ఆలాగు జరిగి తీరుతుంది.

# రెండవ దానస్వస్థి (1950)

**(వినండి, పరీక్షించండి సరియని తోచిన అవలంబింతురు గదా! భేదాభి ప్రాయములున్నను ద్వేషము, కలహము కూడదు).**

చదువరులారా! వినువారలారా! సర్వలోక సృష్టికర్తయైన దేవుని నామమునుబట్టి మీకు శుభము కలుగునుగాక! అనారోగ్యవంతుల అనారోగ్య నిమిత్తమై గుంటూరు సమీపమున నున్న కాకాని స్వస్థిశాలలో ప్రతి సోమవారమున 1949వ సం॥ము నుండి బోధలు, దైవ ప్రార్థనలు జరుగుచున్నవి. వందలాది ప్రజలు స్వస్థత పొందినట్లు ఇచ్చట సాక్ష్యమిచ్చిరి. కొందరు వెంటనే, కొందరు ఇంటివద్ద, కొందరు కొన్ని పర్యాయములు శాలకు వచ్చిన తర్వాత బాగగుచున్నారు. దేవుడు నరుల రక్షణార్థమై యేసుక్రీస్తుగా వచ్చిన లోకరక్షకుడగు వ్యక్తినిగూర్చిన విషయములు ప్రజలు విని నమ్మిక కలిగి ఆనందపడుచున్నారు. బోధవలన ఆత్మీయ జీవనమునకు పాప పరిహారమును, శరీరమునకు ఆరోగ్యమును కలుగును. దేవుడు తన వాక్కును పంపి ప్రజలను బాగుచేసెనని బైబిలులో నున్నది. కీర్తన 107:20. బోధించుట క్రైస్తవ బోధకుల పని, శ్రద్ధగా విని నమ్ముట అనారోగ్యవంతుల పని, మోక్ష ప్రవేశార్థమై పాపపరిహారమును, వ్యాధి పరిహారమును జరిగించుట యేసుక్రీస్తు ప్రభువుయొక్క పని. బోధకులు జబ్బులు బాగుచేయువారని ఎవరును తలంపరాదు. క్రీస్తు ప్రభువే బాగుచేయువాడని వారు కేవలము ప్రకటించువారై యున్నారు. బోధ విను వారందరు క్రైస్తవ మతస్థులగుదురా? అట్లే స్వస్థిశాలకు వచ్చు వారందరును ఆరోగ్యవంతులగుదురా? కొందరు బాగగుటలేదు ఎందుచేత?

1. ఏదో ఒక పాపము నిలిచియుండుట చేతనో, 2. నమ్మిక పూర్తిగా కలుగకుండుటవలననో, 3. స్వస్థికూటమునకు వచ్చి బోధలు సరిగా వినకపోవుట వలననో, 4. స్వస్థిశాలలో యేసుక్రీస్తు ప్రభువును పూజించి, ఇంటికి వెళ్ళి వేరొక పూజ చేయుట వలననో, 5. యేసుక్రీస్తు కాదు ఈ బోధకులే జబ్బులు బాగుచేయువారని తలంచుట వలననో, 6. జబ్బు వెంటనే కుదరకున్న యెడల విసుగుకొనుట వలననో, 7. దేవునికి తెలిసిన మరే ఇతర కారణము వలననో మిగుల కొద్దిమంది బాగగుటలేదు. అట్టివారు తరచుగా వచ్చుట మంచిది.

**వ్యాధిగ్రస్తుల విషయమై ఇక్కడ జరుగుపని ఏదనగా:**

కీర్తనలు నేర్పించుట, బోధ వినిపించుట, దైవప్రార్థనలు చేయుట బాగైనవారిచేత సాక్ష్యములిప్పించుట, తైలాభిషేకము చేయుట ఇది మతిహీనత, గుడ్డితనము, చెవుడు, నత్తి, కుంటితనము, జ్వరము, పక్షవాతము, కుష్టు, సుఖవ్యాధులు ఈ మొదలైనవి నివారణయైనవి. సంతానము లేనివారికి సంతానము కలుగుచున్నది. భూతపీడితులు విముక్తులగుచున్నారు. పశువుల రోగములుకూడ బాగైనవి. ముఖ్యముగా అనేకులకు ఆత్మశాంతి కలుగుచున్నది. దేవునికి వందనములు. బాగైనవారి సాక్ష్యములు ఈ పుస్తకమునందు చదువవచ్చును.

**మా బోధ:** – మనము జన్మింపకముందే మన ఉపయోగార్థమైన సహాయ కారులుగా దేవదూతలను, వెలుగు, నీళ్ళు, గాలి, జీవము, ఆకాశము, భూమి, సముద్రము జీవరాసులు, వృక్షములు వెండి

బంగారములు ఈ మొదలగు వాటిని కలుగజేసిన దేవునికి మన జబ్బులు బాగుచేయుటకు ఇష్టములేదా? ఇంత గొప్ప భూమిని, అంత విశాలమైన ఆకాశమును కలుగజేయ గలగిన కర్తకు మనలను బాగుచేయుటకు శక్తి లేదా? నిరాకారుడైన దేవుడు నరులకు కనిపించుటకును, వారితో మాటలాడుటకును, రక్షణ మార్గోపదేశము చేయుటకును, వారియొద్ద నివసించుటకును, వారు అవలంభింపవలసిన మాదిరి చూపించుటకును, మేలు చేయుటకును, తాను దేవుడనని రుజువు పరచుకొనుటకును యేసుక్రీస్తుగా వెలసియున్నాడు. ఆ ప్రభువు తన ప్రభావముచేత పాపులను క్షమించి, రోగులను ఔషధము లేకుండా బాగుచేసి బ్రతికించి సర్వలోక పాపపరిహారార్థమై యజ్ఞముగా ఇష్టముతో హతుడై మూడవనాడు బ్రతికివచ్చి విశ్వాసులకు కనబడి, మహిమ రూపముతో మోక్షమునకు వెళ్ళెను. తన బోధలు నమ్మి, బాప్తిస్మము పొందువారికి రక్షణ భాగ్యము కలదని ఆయన చెప్పినమాట పట్టుకొని, ఆయన నామధారులగు క్రైస్తవులు అన్ని దేశములకు వెళ్ళి ఒక 1800ల భాషలలో బోధ చేయుచున్నారు. నేను మరలవచ్చి విశ్వాసులను మోక్షమునకు తీసికొని వెళ్ళుదును అని ఆయన చెప్పిన మాటకూడ వారు ప్రకటించుచున్నారు. నేడు యేసుప్రభువు రాకడ మిక్కిలి సమీపముగానున్నది. ప్రార్థన పూర్వకముగా సిద్ధపడండి.

ఆయన వచ్చి, సిద్ధపడినవారికి మరణము లేకుండజేసి, వారిని తన యొద్దకు తీసికొని వెళ్ళును. మిగతావారికి ఏడేండ్లు గొప్పగొప్ప శ్రమలు కలుగును. ఆ శ్రమలలో అనేకులు ఆయన నామస్మరణ చేయుదురు. తరువాత ఆయన భూమిమీదకు వచ్చి వెయ్యి సంవత్సరములు శాంతి పరిపాలన చేయును. ఆ వెయ్యేండ్లు సాతాను

చెరసాలలో ఉండి, తరువాత విడుదల పొంది, దేవునితో యుద్ధముచేసి ఓడిపోవును. ఆ తరువాత మృతులలోను, సజీవులలోను ఉన్న అవిశ్వాసులకు క్రీస్తుప్రభువు నరకము నియమించును. దానిలోనే పాపకారకుడగు సాతానును, అతని సహకారులును ఉందురు. ఈ సంగతులన్నియు బైబిలను దైవ గ్రంథములో గలవు.

యేసుక్రీస్తు అనగా నియమిత రక్షకుడని అర్థము. ఈ పేరు మోక్షలోకమునుండి వచ్చినపేరు గనుక మోక్షము కావలసినవారు ఈ నామస్మరణ చేయవచ్చును. ప్రయత్నించి చూడండి. యేసుక్రీస్తు ప్రభువు దేవుడు గనుకను, ఈయన మన మానవుల నిమిత్తమై మానవుడై యున్నాడు గనుకను, ఈయన సర్వలోకోపకారి గనుకను, ఈయన ప్రత్యేక రక్షకుడైయున్నాడు. “మరి ఎవనివలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము. అని బైబిలు (అపో.కార్య. 4:12)లో ఉన్నది.

మూలికాదులను కలుగజేసి వాటిద్వారా ఔషదములను చేయు జ్ఞానమును నరులకు దయచేసిన దేవునికి స్తోత్రము. అగత్యమని తోచునపుడు ముందుగా దైవ ప్రార్థన చేసికొని ఔషదములు వేసికొనవచ్చును. దేవుడు వాటిని దీవించును. స్వస్థిశాలలో ఔషదములు వేయుము. పరుండునప్పుడు, సౌఖ్యకాలమపుడు, మరణ సమయమప్పుడు యేసుక్రీస్తు ప్రభువు తలంపుతో నుండువారు ధన్యులు, మహాధన్యులు. ఎన్ని పనులున్నను మంచి సమయము, వీలు చూచుకొని ప్రతివారును రోజుకు అధమ పక్షము ఒక గంటయైనను, దైవధ్యానములో ఉన్నయెడల గొప్పమేలు కలుగును. చేసిచూడండి.

# అందరు చేసికొనవలసిన ప్రార్థన

యేసుక్రీస్తు ప్రభువా! నా నిమిత్తమై నీవు చేయు సమస్తోపకారముల కొరకై నీకనేక వందనములు. నా పాపములు పరిహరించుము. పాపములో పడకుండ కాపాడుము. నా వ్యాధులు పోగొట్టుము. నా కష్టస్థితులలోను, పనులలోను, నాకు తోడైయుండుము. నన్ను మాత్రమే కాక సర్వజనులనుకూడ నీ ప్రకటన బోధ మూలముగా నీతట్టు తిప్పి రక్షించుము. నా జీవయాత్ర చాలించిన మీదట నన్ను నీ పరలోక రాజ్యములోనికి చేర్చుకొనుము. ఆమేన్.

# సమాప్తము

## మత్తు పదార్థములు

1. మత్తు పదార్థములు ఆహార పదార్థములు కావు. అవి శరీరారోగ్యమునకు తోడ్పడునవి కావు.

2. మత్తు పదార్థములు అలవాటు చేసికొన్నవారు సహవాసమువలనను, దానివలన వచ్చు నష్టములు తెలియక ప్రారంభములో అలవాటు చేసికొందురు. గ్రహించినమీదట మానలేని బలహీనులగుదురు.

3. మత్తు పదార్థములను అలవాటు చేసికొన్నవారు ఇష్టపూర్వకముగాను, సంతోషముతోను, స్వేచ్ఛాపూర్వకముగాను అలవర్చుకొందురు. మానవలసి వచ్చినపుడు ప్రాణసంకటముగా కన్పించును.

4. శరీరారోగ్యము పాడుచేసి, ఆయుష్కాలమును తగ్గించునంతటి శక్తులు మాత్రమే మత్తు పదార్ధములలో గలవు.

5. పిచ్చి ఆస్పత్రిలో చేర్చబడినవారిలో ఎక్కువమంది మత్తు పదార్ధములకు అలవాటు పడినవారే మతి చలించిన రోగులుగా చేర్చబడుచున్నారు.

6. మత్తుపదార్ధములు తెలివిని, జ్ఞానమును, చురుకైన మనసును, గొప్ప మనో బలమును పాడుచేయును.

7. మత్తు పదార్ధములకు అలవాటుపడిన వారు స్వతంత్రత లేనివారై, బానిసలుగాను, కాపుదల లేనివారునై యున్నారు.

(1) మరణము తప్పదు. శ్రమకూడా తప్పదు. ఈ రెండు ఎప్పుడు వచ్చునో ఎవరికిని తెలియదు. ముందే జాగరూకత కలిగి ప్రవర్తింపవలెను.

(2) వయస్సులో చిన్నవారిని చూచి వారు చేతకానివారని, పనికిరానివారని, అభిప్రాయపడరాదు. అట్టి అభిప్రాయము వారియెదుట బైలుపడరాదు. ఎందుకనగా వారి భవిష్యత్ మనకు తెలియదు గనుక వారే దేశమునకు, సంఘమునకు, నాయకులు అగుదురేమో.

(3) ఎవరిని ఏ విషయములోను నిరుత్సాహపరుప రాదు గాని, దేవుని వాక్యమునుబట్టి, ప్రార్థన సహవాసమునుబట్టి ప్రజలను ప్రోత్సాహపరుపవలెను.

(4) ప్రపంచములో కుటుంబమే ప్రాముఖ్యమైన స్థలము. ఇతరులతో, పరులతో కలసి జీవించుట ఎట్లో నేర్చుకొను పాఠశాలవంటిది ఈ కుంటుంబమే.

(5) మన శాశ్వత జీవిత నివాసమును నిర్మించుటకు శ్రమలు చలువరాళ్ల వంటివని చెప్పవచ్చును.

(6) గతకాల అపజయములనుగూర్చి అధైర్యపడక, ప్రస్తుతమందుగల ఆశీర్వాదములను తలంచుకొని జీవితము కొనసాగించుము ముందునకు నీవు అనేక దీవెనలు పొందగలవు. మరనాత

# దైవిక స్వస్థత

గ్రంథకర్త :

యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2025 చందా. 10.00

Bible Mission HQ Guntur

గుంటూరు నందు

| | | | | |
|---|---|---|---|---|
| ప్రథమ | ముద్రణ | 1937 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1978 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1986 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1993 | ప్రతులు | 5000 |
| ఐదవ | ముద్రణ | 2003 | ప్రతులు | 5000 |
| ఆరవ | ముద్రణ | 2008 | ప్రతులు | 5000 |
| ఏడవ | ముద్రణ | 2014 | ప్రతులు | 3000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2016 | ప్రతులు | 3000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2018 | ప్రతులు | 3000 |
| పదవ | ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |
| పదకొండవ | ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |
| పన్నెండవ | ముద్రణ | 2022 | ప్రతులు | 3000 |
| పదమూడవ | ముద్రణ | 2024 | ప్రతులు | 2000 |
| పదునాల్గవ | ముద్రణ | 2025 | ప్రతులు | 2000 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522 509.

ఫోన్: 9949121777.